RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 312 మేడ్చల్ మల్కాజ్‌గిరి 3 డిసెంబర్ 2024 మంగళవారం పేజీలు : 4

### దేశం కోసమే మా పోరాటం : ప్రియాంక

వయనాడ్ : దేశం కోసమే తాము పోరాడుతున్నామని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, వయనాడ్ ఎంపీ ప్రియాంకా గాంధీ అన్నారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాస్తోందని, కొద్దిమంది తమ వ్యాపార మిత్రులకు సంపదను దోచిపెడుతోందని విమర్శలు గుప్పించారు. వయనాడ్‌లో ఈ ఏడాది జూలై 30న సంభవించిన వరదలకు ఇక్కడి ప్రజలు సర్వస్వం కోల్పోయారని, వారిని ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని దుయ్యబట్టారు. వయనాడు పార్లమెంటు పరిధిలోని మనంతవాదీలో నిర్వహించిన సమావేశంలో ప్రియాంకాగాంధీ ప్రసంగించారు. "ఏ వ్యవస్థలపై ఈ దేశ నిర్మాణం జరిగిందో ఆ వ్యవస్థలను అధికారంలో ఉన్న వారు నాశనం చేస్తున్నారు. అందుకే దేశం కోసం మేం పోరాటం చేస్తున్నాం" అని అన్నారు.

# త్వరలోనే గ్రూప్ 1 ఉద్యోగ నియామక పత్రాలు

## ఆరోగ్య ఉత్సవాలలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్: త్వరలోనే గ్రూప్-1 ఉద్యోగాల నియామకపత్రాలు అందజేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ మార్గ్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఆరోగ్య ఉత్సవాల్లో ఆయన ప్రసంగించారు.

"563 మంది గ్రూప్- 1 అధికారులను తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములను చేయబోతున్నాం. చిన్న ఆరోపణ లేకుండా టీజీపీఎస్సీ పని చేస్తోంది. దీన్ని రాజకీయ పునరావాసంగా మార్చదల్చుకోలేదు. అందుకే సీనియర్ ఐఏఎస్ బుర్రా వెంకటేశంను టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించాం" అన్నారు.

**విద్య, వైద్యమే మా ప్రాధాన్యత..** "ఏడాదిలోనే 14వేల మందిని వైద్య ఆరోగ్యశాఖలో నియమించడం ఒక చరిత్ర. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎనిమిది వైద్య కళాశాలలలు ఇచ్చి ఎలాంటి వసతులూ కల్పించలేదు. దేశంలోనే అత్యధిక డాక్టర్లను అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. గత పదేళ్ల పాలనను మీరు ప్రత్యక్షంగా చూశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత విద్య, వైద్యం. అధికారం వచ్చిన ఏడాదిలోనే 50వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చాం. 6500 మందిని వైద్యారోగ్యశాఖలో నియమించాలని నిర్ణయించాం. బీఆర్ఎస్ పాలనలో బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగ నియామకాల్లేవు. ఉద్యోగ పరీక్షలు నిర్వహించినా.. పేపర్‌లీక్‌ను అరికట్టలేకపోయారు" అన్నారు.

**ఎన్ని అడ్డంకులు సృష్టించినా.. ఉద్యోగాలిచ్చాం!..** "కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఉద్యోగాలు ఊడితేనే.. యువతకు ఉద్యోగాలు వచ్చాయి. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 50వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. కాంగ్రెస్ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇస్తే.. పరీక్షలు షెడ్యూల్ ప్రకారం జరుగుతాయని యువత నమ్ముతోంది.

పరీక్షలు వాయిదా వేస్తూ పోతే.. మీ విలువైన యుక్త వయసు వృథా అవుతుంది. మన భవిష్యత్తు 21 నుంచి 35 ఏళ్ల లోపు మీరు చేసే పనులే నిర్ణయిస్తాయి. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించిన ఉద్యోగాలు ఇచ్చాం.. ఇదీ మా చిత్తశుద్ధి.

గతంలో ఆర్ఎంపీ డాక్టర్‌ను, తహసీల్దార్‌ను టీజీపీఎస్సీ సభ్యులుగా నియమించారు. పునరావాస కేంద్రాలుగా పబ్లిక్ సర్వీస్ కమిషన్లను మార్చేశారు. చిన్న ఉద్యోగి పెద్ద పెద్ద ఉద్యోగులను నియమించలేరుగా? పబ్లిక్ సర్వీస్ ఉద్యోగాల గురించి పూర్తి అవగాహన ఉన్న అధికారులే సక్రమంగా పరీక్షలు నిర్వహిస్తారు. జిల్లాకో మెడికల్ కళాశాల, నియోజకవర్గానికో 100 పడకల ఆస్పత్రి ఇస్తామన్నారు.. ఇవ్వలేదు.



## మహిళా కానిస్టేబుల్ దారుణ హత్య

### తమ్ముడే చంపేశాడు..!

ఇబ్రహీంపట్నం: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో మహిళా కానిస్టేబుల్ నాగమణి హత్యకు గురయ్యారు. రాయపోలు నుంచి ఎండ్లగూడ వెళ్లే రహదారిపై ఈ ఘటన చోటు చేసుకుంది. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నాగమణి హయత్‌నగర్ పోలీసు స్టేషన్‌లో పని చేస్తున్నారు. గతంలో ఆమెకు వివాహం జరిగింది. పది నెలల క్రితం భర్తతో విడాకులు తీసుకున్నారు. నెల రోజుల క్రితం మరో వ్యక్తిని కులాంతర వివాహం చేసుకున్నారు. ఇది చూసి తట్టుకోలేని ఆమె సోదరుడు.. విధులకు వెళ్తుండగా నాగమణిని కారుతో ఢీకొట్టి వేట కొడవలితో దాడి చేసి హతమార్చాడు. మృతురాలి స్వస్థలం రాయపోలుగా పోలీసులు గుర్తించారు. మహిళా కానిస్టేబుల్ నాగమణి, శ్రీకాంత్ నవంబర్ 1న యాదగిరి గుట్టలో ప్రేమ వివాహం చేసుకున్నారని సీఐ తెలిపారు. వీరిది రాయపోలు కాగా.. వివాహ అనంతరం హయత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారని చెప్పారు. ఆదివారం సెలవు కావడంతో దంపతులు సొంత గ్రామానికి వెళ్లారని తెలిపారు. నాగమణిని వెంటపడి కారుతో ఢీకొట్టి.. కొడవలితో హత్య చేసినట్లు గుర్తించినట్లు చెప్పారు.

## లారీ బీభత్సం.. టైర్లకింద నలిగిన ప్రాణాలు..




### రంగారెడ్డి జిల్లాలో లారీ బీభత్సం.. కూరగాయల వ్యాపారులు మృతి

రంగారెడ్డి : రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఆలూరు స్టేజీ వద్ద ఓ లారీ బీభత్సం సృష్టించింది. కూరగాయలు అమ్ముకుంటున్న వారిపైకి లారీ దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, మరో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బాధితులంతా కూరగాయలు అమ్ముకుంటున్న వారేనని పోలీసులు తెలిపారు. సుమారు 50 మందికి కాళ్లు, చేతులు విరగడంతో అక్కడ భీతావహ పరిస్థితి నెలకొంది. బాధితులంతా నడవలేని పరిస్థితిలో ఉన్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఇక లారీ వేగానికి అక్కడున్న ఓ భారీ వృక్షం కూడా కుప్పకూలింది. లారీ క్యాబిన్‌లో డ్రైవర్ చిక్కుకున్నాడు. లారీ వేగాన్ని చూసి స్థానికులు పరుగులు పెట్టారు.



## ఏటూరునాగారం ఎన్‌కౌంటర్..

### మృతదేహాలను భద్రపరచాలని హైకోర్టు ఆదేశం

హైదరాబాద్: ఏటూరునాగారం ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలను భద్రపరచాలని తెలంగాణ హైకోర్టు పోలీసులను ఆదేశించింది. మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని పౌరహక్కుల సంఘం తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. భోజనంలో మత్తు పదార్థాలు కలిపి మావోయిస్టులను కస్టడీలోకి తీసుకున్నారని, ఆ తర్వాత చిత్రహింసలకు గురిచేసి కాల్చి చంపారని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. మావోయిస్టుల మృతదేహాలపై తీవ్ర గాయాలున్నాయని, కనీసం కుటుంబ సభ్యులకు చూపించకుండా పోస్టుమార్టం కోసం తరలించారని కోర్టుకు వివరించారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ నిబంధనలకు విరుద్ధంగా పోలీసులు వ్యవహరించారన్నారు. అడవిలో పోలీసుల భద్రత దృష్ట్యా మృతదేహాలను వెంటనే ములుగు ఆస్పత్రికి తరలించినట్లు ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. కాకతీయ మెడికల్ కళాశాలకు చెందిన వైద్య నిపుణుల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించామన్నారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని వీడియో తీసినట్లు చెప్పారు. పోస్టుమార్టం ముగిసిన తర్వాత రేపటి వరకు మృతదేహాలను భద్రపర్చాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. మృతదేహాలను కుటుంబ సభ్యులకు, బంధువులకు చూపించాలని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

# కనీ మహా ప్రమాణం...

## ఆయనకు జాక్ పాట్ లా సీఎం చాన్స్?

### షిండే వర్సెస్ ఫడ్నవీస్ - మధ్యలో దూరిన మురళీధర్ మోహోల్




### యూపీ, మధ్యప్రదేశ్, ఒడిషా ఫాలాను అనుసరిస్తున్న ఎన్‌డీఏ?

మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు వచ్చి వారం రోజులు దాటిపోయాయి. ఇంకా కొత్త ప్రభుత్వం కొలువు తీరలేదు. మహారాష్ట్ర అసెంబ్లీ గడువు నవంబర్ 26తో పూర్తి అయిపోయింది. దాంతో సీఎం గా ఉన్న ఏక్ నాథ్ షిండే తన పదవికి రాజీనామా చేశారు. ఆయననే ఆపద్ధం సీఎం గా ఉండాలని గవర్నర్ కోరారు. ఇక గడువు ముగిసిన అసెంబ్లీకి రాష్ట్రపతి పాలన పెట్టడమే బెటర్ అని విపక్షం అంటోంది. మరో వైపు జార్ఖండ్ లో కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయింది. మహారాష్ట్ర రాజకీయం మాత్రం అలాగే కొనసాగుతోంది. కనీ వినీ ఎరగని విధంగా మెజారిటీని అప్పగించిన ప్రజలు ఇంకా ప్రభుత్వం ఏర్పాటు కాకపోవడం పట్ల విస్తుపోతున్నారు. అయితే ఆ అధిక మెజారిటీయే ఇపుడు ప్రభుత్వం ఏర్పాటుకు ఇబ్బందిగా మారుతోంది అని అంటున్నారు. ఏక్ నాథ్ షిండే తనకే సీఎం కావాలని అంటున్నారు. ఢిల్లీలో బీజేపీ పెద్దలు నచ్చచెప్పినా ఆయన మాత్రం పట్టు వీడలేదు. మరో వైపు చూస్తే నిన్నటి దాకా బీజేపీ సీఎం అభ్యర్థికి మద్దతు ఇచ్చిన ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ కూడా తనకూ సీఎం కావాలని ఉందని కోరికను బయటపెడుతున్నారు.

దాంతో చిక్కు ముడి వీడడం కష్టంగా ఉంది. ఈ నేపథ్యంలో మరాఠా వారే కొత్త సీఎం కావాలని నినాదం ఊపందుకుంటోంది. బీజేపీని విజయ బాటన గెలిపించిన మాజీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో ఆయనను వద్దు అంటున్న వారూ బీజేపీలోనూ కనిపిస్తున్నారు. దీంతో మధ్యేమార్గంగా కేంద్రంలో విదేశాంగ శాఖ సహాయమంత్రిగా ఉన్న పూణేకు చెందిన ఎంపీ మురళీధర్ మొహెూల్ కి సీఎం చాన్స్ జాక్ పాట్ లా తగలనుంది అని అంటున్నారు. ఆయన మరాఠా నేతగా ఉన్నారు. అంతే కాదు బలమైన ఆరెస్సెస్ నేత కాబట్టి పూర్తి స్థాయి మద్దతు ఆయనకు దక్కుతోంది. ఇక ఫడ్నవీస్ సీఎం అయితే ఒప్పుకోని మిత్రులు ఏక్ నాథ్ షిండే, అజిత్ పవార్ లు కొత్త వారు అయిన మురళీధర్ మోహెూల్ కి మద్దతు ఇస్తారని కూడా బీజేపీ ఆశిస్తోంది. ఇక మరాఠా నినాదంతో తమ పార్టీలను రాజకీయాలను బలంగా నడుపుతున్న శివసేన ఉద్ధవ్ థాక్రే అలాగే శరద్ పవార్ ఎన్సీపీలకు మరోసారి చాన్స్ ఇవ్వకూడదు అనుకుంటే మరాఠా నేతకే సీఎం పదవి ఇవ్వడమే సరైన వ్యూహం అని బీజేపీ పెద్దలు భావిస్తున్నారుట. అవసరమైతే ఫడ్నవీస్ ని కేంద్రంలోకి తీసుకుని కీలకమైన శాఖలతో కేబినెట్ మంత్రిగా చేస్తారు అంటున్నారు. మొత్తానికి యూపీలో మధ్యప్రదేశ్, ఒడిషాలో అనుసరించిన విధానంలోనే ఇక్కడా అనుసరించి సక్సెస్ కావాలని బీజేపీ చూస్తోంది. ఏది ఏమైనా సీఎం అభ్యర్థి ఎవరో తేల్చకుండానే డిసెంబర్ 5న ప్రమాణం అన్నది మాత్రం ప్రకటించారు అంటున్నారు.

# సంపాదకీయం

## సీఎం రేవంత్‌కు 'పునరాలోచన' తప్పదా? ఏడాది పాలనలో..!

అధికారంలో ఉన్న పార్టీ చాలా జాగ్రత్తగా అడుగులు వేయాలి. ఏ చిన్న తేడా వచ్చినా.. రివర్స్ అవుతుంది. ముఖ్యంగా విపక్షాలను టార్గెట్ చేసే సమయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. లేకపోతే.. అవి వికటించే ప్రమాదం కూడా ఉంటుంది. ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌ను కట్టడి చేయాలన్నది ఆ పార్టీ ప్లాన్. దీనిని రాజకీయ కోణంలో చూసినప్పుడు తప్పుపట్టాల్సిన అవసరం లేదు. అయితే.. ఆ ప్లాన్ బెడిసికొడితేనే ఇబ్బంది. తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాలు.. ఈ తరహాలోనే ఉన్నాయన్నది రాజకీయ విశ్లేషకుల మాట. బీఆర్ ఎస్‌పై ఆయన కసితో ఉండొచ్చు. రాజకీయ వైరం మేరకు ఆ పార్టీని కోలుకోకుండా చేయాలని కూడా భావించవచ్చు. కానీ, ఆ దిశగా తీసుకున్న చర్యలు మాత్రం పెద్దగా ఫలించకపోవడం.. రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ప్రస్తుతం రేవంత్ సర్కారు పాలన ప్రారంభమై ఏడాది పూర్తవుతున్న సమయంలో ఇప్పుడు ఆసక్తిగా మారింది. 1) ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం: ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారాన్ని తెరమీదికి తెచ్చారు. గత బీఆర్ ఎస్ ప్రభుత్వం ఉన్నతాధికారులను వినియోగించి.. ఎన్నికలకు ముందు ఈ తతంగాన్ని నడిపించిందనే ఆరోపణలు ఉన్నాయి. పెద్ద ఎత్తున దీనిపై విచారణ కూడా సాగింది. ఇంకేముందు.. బీఆర్ ఎస్ కీలక నాయకుడు కేటీఆర్ అరెస్టు ఖాయమని అనుకున్నారు. కానీ, ఇప్పటి వరకు కేసు విచారన జరుగుతూనే ఉంది. కేటీఆర్ సేఫ్‌గానే ఉన్నారు. 2) బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరికలు: తద్వారా.. ప్రతిపక్షాన్ని నిలువరించాలన్నది సీఎం రేవంత్ ప్లాన్. ఈ క్రమంలోనే ఇంటికి వెళ్లి మరీ అరికపూడి గాంధీ వంటివారిని పార్టలో చేర్చుకున్నారు. కానీ, ఇది సొంత పార్టీలోనే బెడిసికొట్టింది. బీఆర్ ఎస్‌పై సానుభూతి పెంచేలా చేస్తున్నారంటూ.. జీవన్ రెడ్డి వంటి వారు రోడ్డెక్కే పరిస్థితి వచ్చింది. మరోవైపు.. కేసులు కూడా కొనసాగుతున్నాయి. 3) హైడ్రా: మూసీ నది ప్రక్షాళన చేయడాన్ని ఎవరూ తప్పుపట్టకపోయినా.. హైడ్రా పేరుతో ఈ ఏడాది జూలైలో తెచ్చిన వ్యవస్థ సాధారణ ప్రజలకు కంటిపై కునుకు లేకుండా చేసింది. మరోవైపు రియల్ ఎస్టేట్ రంగంపై ప్రభావం పడింది. పడలేదని ప్రభుత్వం చెబుతున్నా.. రియల్ వర్గాలు మాత్రం వెంచర్లు నిలుపుదల చేసుకున్నాయి. పైగా.. ఈ వ్యవహారంలో బీఆర్ ఎస్ నాయకులను హైడ్రా నిలువరించలేక పోయింది. ఇలా.. పలు కీలక అంశాల్లో రేవంత్‌రెడ్డి వేసిన అడుగులు సమీక్షకు గురయ్యాయనే చెప్పాలి. మరి ఆయన ఆత్మ విచారం చేసుకుంటారో లేదో చూడాలి. ఒక్క మాటలో చెప్పాలంటే.. బీఆర్ఎస్‌ను దాని మానాన దానిని వదిలేసి ఉంటే.. వేరేగా ఉండేది. కానీ, వీటిని కెలకడం ద్వారా.. ఆ పార్టీకి అనవసర హైప్ ఇచ్చారన్న చర్చ కూడా సాగుతోంది.

# డొక్కు వాహనాలకు చెల్లు



హైదరాబాద్: వాహనాల ఫిట్‌నెస్‌లో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట పడనుంది. ప్రయాణికుల ప్రాణాలకు భరోసా దక్కనుంది. గ్రేటర్‌లో ప్రజా, సరకు రవాణా వాహనాల తనిఖీలకు ఆటోమేటెడ్ వాహన ఫిట్‌నెస్ కేంద్రాలు అందుబాటులో రానున్నాయి. తాజాగా రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించిన నేపథ్యంలో ఈ కేంద్రాల ఏర్పాటుకు మార్గం సుగమం కానుంది. గతంలో ప్రతిపాదనల వద్ద ఆగిన వీటికి కార్యాచరణ సిద్ధం కానుంది.

నగరం నలువైపులా..గ్రేటర్ పరిధిలో నలువైపులా నాలుగు కేంద్రాలను ఏర్పాటుచేయనున్నారు. ఒక్కో కేంద్రానికి రూ.8 కోట్ల వరకు వెచ్చించనున్నారు.

గ్రేటర్‌వ్యాప్తంగా 80 లక్షల వాహనాలున్నాయి. ఇందులో ఆటోలు, బస్సులు, మినీ బస్సులు, ట్రావెల్ బస్సులు, ఇతర రవాణా వాహనాలు ఏటా ఫిట్‌నెస్ ధ్రువీకరణ తీసుకోవాలి. అప్పుడే రోడ్లపైకి అనుమతించనున్నారు.

ప్రస్తుతం ఈ తనిఖీలు మాన్యువల్‌గా మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు చేస్తుండగా.. సక్రమంగా సాగడం లేదనే ఆరోపణలున్నాయి. కొన్నిసార్లు వాహనాలకు ఫిట్‌నెస్ లేకున్నా సరే.. చూసీచూడనట్లు ఉంటున్నారు. తూతూమంత్రంగా తనిఖీలు చేసి ధ్రువీకరణ జారీ చేస్తుండటంతో తరచూ ప్రమాదాలు జరిగి అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. పాఠశాలల బస్సులకు సైతం సక్రమంగా ఫిట్‌నెస్ ధ్రువీకరణ జరగడం లేదు. డొక్కు బస్సులు, వ్యాన్ల వల్ల విద్యార్థుల ప్రాణాలు గాల్లో దీపంలా మారుతున్నాయి.

టైర్ల నుంచి బ్రేకుల వరకు ఆటోమేటెడ్ కేంద్రాల్లో పరిశీలించనున్నారు. సికింద్రాబాద్, నాగోలు, ఉప్పల్, కొండాపూర్ ప్రాంతాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటుచేయడం ద్వారా నలువైపులా అందరికి అందుబాటులో ఉంటాయని భావిస్తున్నారు. ఆటోమొబైల్ రీసెర్చ్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా(ఏఆర్ఏఐ) నిబంధనలకు అనుగుణంగా ఈ కేంద్రాలను తీర్చిదిద్దనున్నారు.

ఇక నుంచి తనిఖీలిలా..


కంప్యూటర్లే వాహనాలను పూర్తిగా విశ్లేషిస్తాయి. ఇంజిన్ సామర్థ్యం, బ్రేకులు, టైర్లు కీలకమైన భాగాలతోపాటు వైపర్లు, సైడ్ మిర్రర్‌లు, షాక్ అబ్జర్వర్లు, డైనమో, బ్యాటరీ తదితర 40 అంశాలను అన్ని కోణాల్లో పరిశీలిస్తాయి. ఎలక్ట్రికల్, మెకానికల్ లోపాలు ఇట్టే తెలిసిపోతాయి.

వాహనాల నుంచి వెలువడిన పొగలో కాలుష్య కారకాలను గుర్తించి పొల్యూషన్ అండ్ కంట్రోల్(పీయూసీ) ధ్రువీకరణ అర్హత ఉన్నది లేనిదీ ఆటోమేషన్‌లోనే గుర్తించి నివేదిక ఇస్తాయి.

గంటలో ఒక్కో కేంద్రంలో 25-30 వాహనాల వరకు తనిఖీలు నిర్వహించేలా తీర్చిదిద్దుతున్నారు. పూర్తి స్థాయిలో కంప్యూటరీకరించిన ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. తనిఖీలు తర్వాత వాహన ఫిట్‌నెస్‌పై కంప్యూటర్లే ఆటోమేటిక్‌గా స్కోరు అందిస్తాయి. ఇంజిన్, టైర్లు ఇతర లోపాలుంటే కొత్త విడి భాగాలను బిగించి మళ్లీ ఫిట్‌నెస్ నిర్వహించనున్నారు.

ప్రస్తుతం మోటారు వాహన ఇన్‌స్పెక్టర్లు నిర్వహించే ఫిట్‌నెస్ తనిఖీల్లో శాస్త్రీయత ఉండటం లేదు. కాలం చెల్లిన డొక్కు వాహనాలకూ ఫిట్‌నెస్ ఉన్నట్లు ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. తర్వాత ఇవే ప్రమాదాలకు కారణమవుతున్నాయి.ఆటోమేటెడ్ వాహన ఫిట్‌నెస్ కేంద్రాల ధ్రువీకరణతో డొక్కు వాహనాలకు ఇక కాలం చెల్లినట్లే.

# లోతులో పొరలు.. తీసేందుకు అదిక ఖర్చు



గోదావరిఖని : సింగరేణి గనుల్లోని బొగ్గు పొరలు లోతులో ఉండటంతో వాటిని వెలికి తీసేందుకు సంస్థకు అధిక వ్యయమవుతుంది. ఫలితంగా బొగ్గు ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. దీంతో టన్ను ఉత్పత్తికి ఉపరితల గనుల్లో రూ. 3 వేల వరకు వెచ్చించాల్సి వస్తుంది. మార్కెట్‌లో టన్నుకు రూ.3,500 నుంచి రూ.5 వేల వరకు విక్రయిస్తుంది. అయితే భూగర్భ గనుల్లో ఉత్పతవుతున్న బొగ్గు ప్రతి టన్నుకు రూ.10 వేల వరకు వెచ్చించి.. మార్కెట్‌లో రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకే విక్రయిస్తుంది.

ఇతర కంపెనీల కంటే ఎక్కువ

సహజ సిద్ధంగా ఏర్పడ్డ బొగ్గు పొరలు లోతులో ఉండటంతోనే సింగరేణి భారీగా వ్యయం వెచ్చించాల్సి వస్తుంది. దీంతో సంస్థకు ఆశించిన స్థాయిలో లాభాలు రాకపోవడంతో.. ఇతర కంపెనీల కంటే బొగ్గు ధర ఇక్కడ ఎక్కువగా ఉంటుంది. సింగరేణి పరిధిలో ఉన్న గనుల్లో భూగర్భ పరిస్థితుల ప్రకారం ఒక టన్ను బొగ్గును వెలికి తీయాలంటే ఆరు టన్నుల మట్టిని ఉత్పత్తి చేయాల్సి వస్తుంది.

36 మిలియన్ టన్నులు వీటికే..ఎన్టీపీసీకి రామగుండం ప్రాంతంలోని గనులు, జెన్‌కోకు చెందిన కేటీపీఎస్‌కు కొత్తగూడెం, కేటీపీపీకి భూపాలపల్లి, బీటీపీపీకి మణుగూరు గనులు సమీపంలోనే ఉండటంతో బొగ్గు రవాణా ఛార్జీల భారం లేకుండా పోయింది. సింగరేణి ఏటా ఉత్పత్తి చేస్తున్న 70 మిలియన్ టన్నుల్లో 36 మిలియన్ టన్నుల బొగ్గు వీటికే రవాణా చేస్తోంది. మిగతా బొగ్గు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు ప్రాంతాల్లో ఉన్న విద్యుత్తు కేంద్రాలకు రవాణా చేస్తోంది.

కలిసివస్తున్న రవాణా భారం

సింగరేణి ఉత్పత్తి చేస్తున్న బొగ్గు ధర ఎక్కువగా ఉన్నప్పటికీ.. ఇతర కంపెనీల నుంచి రవాణా చేసుకోవడం వినియోగదారులకు భారంగా మారుతుంది. అక్కడి బొగ్గు ధరతోపాటు రవాణా ఛార్జీలు కలిపితే అదే స్థాయిలో ధర అవుతుండటంతో సింగరేణి నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఎన్టీపీసీ, తెలంగాణ జెన్‌కో, కర్ణాటక, గుజరాత్, తమిళనాడు, మహారాష్ట్ర విద్యుత్తు ఉత్పత్తి సంస్థలు ఎక్కువగా ఇక్కడి బొగ్గును తీసుకుంటున్నాయి. కొన్ని విద్యుత్తు కేంద్రాలకు పిట్‌హెడ్ పరిధిలోనే గనులు ఉండటంతో రవాణా భారం లేకుండా పోతుంది.

ఇతర రాష్ట్రాల్లో పైపైనే..

తెలంగాణలో ఉన్న బొగ్గు నిక్షేపాల కంటే ఇతర రాష్ట్రాల్లోని పొరలు తక్కువ లోతులో ఉన్నాయి. ప్రధానంగా ఒడిశాలోని మహానది కోల్‌ఫీల్డ్‌లోని గనుల్లో.. కేవలం ఒక టన్ను బొగ్గును వెలికి తీయాలంటే రెండు నుంచి మూడు టన్నుల మట్టిని తొలగిస్తే సరిపోతుంది. సింగరేణిలో స్ట్రిప్పింగ్ రేషియో 6 నుంచి 8 వరకు ఉంది. ఇతర రాష్ట్రాల్లో 2.8 నుంచి 3.5 వరకు మాత్రమే ఉంది. దీనివల్ల అక్కడ ఉత్పత్తి వ్యయం తక్కువగా ఉంటుంది. బొగ్గు ధర తక్కువగానే ఉంటుంది.

# నిలిచిన పైవంతెన పనులు.. తీరని కష్టాలు

వేములవాడ : వర్షాకాలంలో ఏటా వరద ఉధ్ధృతితో వాహనాల రాకపోకలు నిలిచిపోతుండటంతో పైవంతెన నిర్మాణం చేపట్టాలని నిర్ణయించి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే గుత్తేదారు నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో వంతెన నిర్మాణంలో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటుంది. సకాలంలో పూర్తి కాకపోవడంతో అత్యవసర సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేములవాడ గ్రామీణ మండలం హన్మాజీపేటలో వర్షాకాలంలో నక్కవాగు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోతుంటాయి. హన్మాజీపేట, బొల్లారం, లింగంపల్లి, కోనరావుపేట మండలం మామిడిపల్లి, బావుసాయిపేట గ్రామాల ప్రజలు నక్కవాగు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. చిన్నపాటి వర్షానికి నక్కవాగు ప్రవహించడంతో వాగు దాటేందుకు వీలుపడదు. పైవంతెన నిర్మించాలని ఈ ప్రాంత ప్రజలు ఏళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారులకు విజ్ఞప్తి చేయడంతో ప్రభుత్వం వంతెన నిర్మాణం కోసం రూ. 11.55 కోట్లను మంజూరు చేసింది. ఇవీ ఇబ్బందులువంతెన నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ పనులు సకాలంలో ప్రారంభం కాలేదు. ఏడాది క్రితం పనులు ప్రారంభించినప్పటికీ నేటికీ పిల్లర్ల దశలోనే ఉన్నాయి.

వాహనాల రాకపోకల కోసం తాత్కాలిక దారిని ఏర్పాటు చేశారు. వర్షాలకు పలుమార్లు కొట్టుకుపోయింది. దీంతో హన్మాజీపేట, బొల్లారం, లింగంపల్లి గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.వంతెన పూర్తికాకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వెళ్లడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల హన్మాజీపేట గ్రామానికి చెందిన ఓ మహిళ అస్వస్థతకు గురికాగా 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. 108 వాహనం వాగు దాటడానికి రోడ్డు లేకపోవడంతో సిబ్బంది ఆమెను గ్రామం నుంచి



స్ట్రెచర్‌పై వాగు దాటించి ఆసుపత్రికి తీసుకెళ్లగా సకాలంలో వైద్యం అందకపోవడంతో ఆమె ప్రాణాలు విడిచింది.

ఏడాదిలో వంతెన నిర్మాణం పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

త్వరితగతిన పూర్తి చేయాలివంతెన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. వర్షాకాలంలో అత్యవసర సమయంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రికి సకాలంలో వెళ్లలేక వృద్ధురాలు ప్రాణాలు కోల్పోయింది. తాత్కాలిక రహదారి కోతకు గురైంది. అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి.రాకేశ్, హన్మాజీపేట

వర్షాలతో ఆలస్యంవర్షాలు కురవడంతో వంతెన నిర్మాణ పనుల్లో ఆలస్యం జరుగుతుంది. పిల్లర్ల దశకు వంతెన పనులు చేరుకున్నాయి. దీపావళి అనంతరం తిరిగి ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నాం. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని గుత్తేదారుకు సూచించాం. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశాం. శాంతయ్య, డీఈ ఆర్ అండ్ బీ

# పోషకాలు.. ఆరోగ్యానికి బాటలు

కరీంనగర్ : ఆరోగ్యకర జీవన విధానంపై ప్రజల్లో రోజురోజుకు అవగాహన పెరుగుతోంది. ప్రచార మాధ్యమాలు.. వైద్య నిపుణుల సలహా మేరకు ఆహార పద్ధతుల్లో మార్పులు చేసుకుంటున్నారు. నిత్యం భుజించే పదార్థాలకు భిన్నంగా ఆలోచిస్తున్నారు. రోగ నిరోధక శక్తిని పెంపొందించుకుంటున్నారు. రోగాలతో మందులకు వెచ్చించే సగం డబ్బులతో.. అవి రాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటిస్తున్నారు. కార్బొహైడ్రేట్లకు బదులుగా పోషకాహారంపై దృష్టి సారిస్తున్నారు. కరోనా తర్వాత అధిక మంది గింజలు తింటూ ఆరోగ్యాన్ని పెంపొందించుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. నేడు జాతీయ గింజల దినోత్సవం సందర్భంగా వాటి వినియోగం ఉమ్మడి జిల్లాలో ఎలా పెరిగింది. వాటితో ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయో వివరిస్తూ 'న్యూస్‌టుడే' కథనం.

పెరిగిన వినియోగం..

కరోనా తర్వాత ఉమ్మడి జిల్లాలో గింజల వినియోగం పెరిగింది. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు వీటిని తింటున్నారు. కాకపోతే ఖర్చు ఎక్కువ కావడంతో సగం మంది మాత్రమే వీటిని తీసుకుంటున్నారు. సామాన్య కుటుంబాలు మాత్రం పేదోడి గింజగా పేరొందిన వేరుశనగను తింటున్నారు. 20 ఏళ్ల కిందట కరీంనగర్ టవర్ సర్కిల్‌లో గింజల దుకాణాలు ఒకటి, రెండు మాత్రమే ఉండేవి. ఇప్పుడు నగరంలో చాలా ప్రాంతాల్లో దుకాణాలు వెలిశాయి. కరీంనగర్, పెద్దపల్లి, గోదావరిఖని, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రాల్లో దుకాణాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఒకప్పుడు జనాభాలో 5 శాతం మంది మాత్రమే వీటిని తినేవారు. ప్రస్తుతం 40 శాతం మంది ఏదో ఒకటి, రెండు రకాలు కొనుక్కొని వెళ్తున్నారని వ్యాపారి రమేష్ తెలిపారు.

బరువు తగ్గాలనుకునేవారు ప్రతి రోజు గుప్పెడు గింజలు ఆహారంలో భాగం చేసుకోవాలి.

వాల్‌నట్స్ : మెదడు ఆరోగ్యానికి దోహదపడతాయి. వీటిలోని కాల్షియం, మెగ్నీషియం వంటివి ఎముకల ఆరోగ్యాన్ని కాపాడతాయి. ఆర్థరైటిస్ వంటి వ్యాధుల బారిన పడకుండా రక్షిస్తాయి.

జీడిపప్పు: గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచే మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వు ఇందులో ఉంటుంది. అల్పాహారంలో భాగంగా తీసుకుంటే మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. గుండె జబ్బులు నియంత్రణలో ఉంటాయి.

గుమ్మడిగింజలు: శరీరానికి ప్రొటీన్ మెగ్నీషియం, ట్రిఫ్టోఫాన్‌లు అధికంగా లభిస్తాయి.

పొద్దుతిరుగుడు విత్తనాలు: కంటిచూపు మెరుగుపరచడంతో పాటు శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పెరగకుండా చూస్తాయి.

బాదం: విటమిన్స్‌తోపాటు కొవ్వు, ప్రొటీన్ అధికంగా లభిస్తాయి. శరీరాన్ని దృఢంగా ఉంచడంలో సహాయపడతాయి.

పిస్తా పప్పులు: వీటితో శరీరానికి అధిక ప్రొటీన్ లభిస్తుంది. కంటి చూపు మెరుగుపర్చడంలో మేలు చేస్తుంది.

వేరుశనగలు(పల్లీలు): కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్, అధిక రక్తపోటు వంటి సమస్యల నుంచి బయటపడటానికి సహాయపడతాయి.

విటమిన్లు.. ఖనిజాలు..

గింజలు బాదం, వాల్‌నట్స్, జీడిపప్పు, పిస్తా, పొద్దుతిరుగుడు ఇలా అనేక రకాల్లో లభిస్తున్నాయి. వీటిలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు(మాంసకృత్తులు), ఫైబర్(పీచు), విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ప్రస్తుతం చాలామంది అల్పాహారంలో భాగంగా వీటిని తీసుకుంటున్నారు. రాత్రిపూట తీసుకుంటే జీర్ణ సంబంధ సమస్యలు వస్తాయి.

సాయిప్రియ, పోషకాహార నిపుణురాలు

ఖర్చు కంటే ఆరోగ్యం ముఖ్యం..

బయట ఏ ఆహారం తీసుకున్నా ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. నాణ్యత, శుచి, శుభ్రత పాటించడం తగ్గిపోయింది. కరోనా తర్వాత ప్రతి రోజు ఉదయం గింజలు, ఎండుఫలాలను తీసుకుంటున్నా. ఖర్చు కంటే ఆరోగ్య ముఖ్యమని భావించి వీటిని తీసుకుంటున్నా. మధ్యాహ్నం కొద్దిగా అన్నం తింటున్నా.

రాజన్న, నీటి పారుదల శాఖ ఉద్యోగి

మా పిల్లల స్నాక్స్ బాక్స్‌లో..

మా ఇద్దరు పిల్లలు బడికి స్నాక్స్ తీసుకెళ్తుంటారు. అందులో బయటి తినుబండారాలు పెట్టను. పండ్లు పెడదామన్నా.. మధ్యాహ్నం వరకు వాడిపోతున్నాయి. అందుకనే బాదం, కాజులాంటివి పెట్టి పంపిస్తున్నాం. కొన్ని సార్లు బాదం, కాజు, ఎండుద్రాక్ష, కర్జూరాలతో లడ్డూగా చేసి ఇస్తున్నాం. ఒక్కోసారి పల్లిపట్టీలు చేస్తున్నా. బాదం నానబెట్టి తినిపిస్తుంటాం.రంగ అనూష, గృహిణి, కరీంనగర్

## ప్రారంభంలో ఆర్భాటం.. కొనడంలో ఆలస్యం

గంగాధర : పంట పండించడం ఒక ఎత్తు.. దానిని అమ్ముకునేందుకు అన్నదాతల పాట్లు మరో ఎత్తు. సాగు మొదలుకుని చీడపీడలు, అకాల వర్షాలతో దిగుబడులపై ప్రభావం.. ఇవన్నీ తట్టుకుని నిలబడ్డ రైతులు పంట అమ్ముకునేందుకు కేంద్రాలకు వస్తే అక్కడా ఆలస్యమవుతోంది. ప్రభుత్వం ఓ వైపు జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నా... ఎక్కడా గింజ కూడా కొనడంలేదు. అక్కడికి ధాన్యం తెచ్చిన రైతులు ఎప్పుడు కొంటారా? అని ఎదురుచూస్తున్నారు. ఫలితంగా కొందరు రైతులు రైస్‌మిల్లర్లు, వ్యాపారులను ఆశ్రయించి తక్కువ ధరకే అమ్ముకుంటూ నష్టపోతున్నారు.

అరకొర వసతులు.. తూకంలో కోత

అనేక కేంద్రాలకు ఇప్పటికి గన్నీ సంచుల సరఫరా జరగలేదు. కేవలం మార్కెట్ యార్డులలోని కేంద్రాల్లో మాత్రమే వసతులు ఉన్నాయి. వర్షాకాలంలో పంటను కాపాడుకునేందుకు కేంద్రాల నిర్వాహకులు తాటిపత్రిలు సమకూర్చక రైతులే కొనుగోలు చేసుకుంటున్నారు. ధాన్యం శుభ్రం చేసే యంత్రాలు ఉన్నా.. విద్యుత్తు సదుపాయం లేక ఇబ్బంది పడుతుండగా ధాన్యం శుభ్రంగా లేదని క్వింటాలుకు అదనంగా 2 నుంచి 5 కిలోల ధాన్యం ఎక్కువగా తూకం వేస్తున్నారు.

ఏ గ్రేడ్ క్వింటాలు ధాన్యానికి రూ.2320, కామన్ రకానికి రూ.2300 ప్రభుత్వ మద్దతు ధర అందిస్తోంది. అయితే సన్నరకం ధాన్యానికి తర్వాత అదనంగా రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించి ంది. అయితే ఇందులో 30 రకాల సన్న ధాన్యం కొనుగోలు చేయడం తో.. అందుకు సంబంధిత ఏఈవో ధ్రువీకరించాల్సి ఉంటుంది.


అధికంగానే దిగుబడులుజిల్లాలో ఈ వానాకాలంలో దాదాపు 2.73 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో దొడ్డురకం 1.52 లక్షల ఎకరాల్లో, సన్నరకం 1.22 లక్షల ఎకరాల్లో చేశారు. ఈ లెక్కన దొడ్డు రకం ధాన్యం 3.18 లక్షల మెట్రిక్ టన్నులు, సన్నరకం 2.49 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశముంది. జిల్లాలో 340 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే అనేక గ్రామాల్లో ప్రారంభించారు.తక్కువ ధరకే అమ్మకంకొనుగోళ్లు దీపావళి తర్వాత కొలిక్కి వచ్చే అవకాశం ఉండటంతో.. అప్పటిదాకా ధాన్యం ఆరబెట్టి అమ్ముకోవడానికంటే ముందే రైతులు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. పచ్చి వడ్లు క్వింటాలుకు రూ.1850కు అమ్ముకుంటున్నారు. ఇదే అవకాశంగా తీసుకుంటున్న వ్యాపారులు.. 70 కిలోల సంచి తూకానికి అదనంగా ధాన్యం వేస్తున్నారు.

# గొలుసుకట్టు చెరువులు.. ఛిన్నాభిన్నం

ధర్మపురి : పాలకులు, అధికారుల నిర్లక్ష్యం సహజ నీటి వనరులు, వాటి కింది ఆయకట్టును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ధర్మపురి మండలంలోని పలు గ్రామాల్లో గొలుసుకట్టు చెరువులు ఛిన్నాభిన్నంగా మారాయి. దీంతో ఆయకట్టు రైతులకు సాగు నీరందడం లేదు. ముఖ్యంగా ధర్మపురి సమీపంలోని అక్కపల్లి చెరువు, జైన గ్రామంలోని గొలుసుకట్టు చెరువులు దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోక అధ్వాన్నంగా మారాయి. మరోవైపు 2022 జులైలో భారీ వర్షాలకు దెబ్బతిన్న చెరువులకు ఇప్పటివరకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టలేదు.

**కాలువ నీరు రానికాలంలో ఇవే ఆధారం**

జైన గ్రామంలో ఔసులవానికుంట, రాయికుంట, ఏదులకుంట, చాకిరేవుకుంట, ఎన్నం భీమయ్యకుంట, జక్కులవానికుంట, ఊరచెరువు, చింతల చెరువు, మూలకుంట, బొల్లం రామయ్యకుంటలు ఉన్నాయి. ఇవి ఒకదానిపై ఒకటి అనుసంధానమై ఉన్న గొలుసుకట్టు చెరువులు. ఒక్క చెరువులోకి చేరిన నీరు కాలువల ద్వారా మిగతా చెరువుల్లోకి చేరుతోంది. ఎస్సారెస్పీ కాలువ నీరు రాని కాలంలో ఈ చెరువుల ద్వారా సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీరందేది. అయితే భారీ వర్షాలకు కాలువలు, తూములు దెబ్బతినడంతో ప్రస్తుతం ఈ వ్యవస్థ ఛిన్నాభిన్నమయింది. ఈ కుంటలు మరమ్మతులకు నోచుకోకపోవడంతో పరిస్థితి అధ్వాన్నంగా మారింది. అలాగే ధర్మపురి పట్టణ సమీపంలోని అక్కపల్లి చెరువు కింద కూడా పది వరకు గొలుసుకట్టు



చెరువులు, కుంటలు ఉన్నాయి. కానీ ఈ చెరువుల కింద కాలువలన్ని పిచ్చిమొక్కలు, పూడికతో కూడుకుపోయి ఉండటంతో నీరు పారడం లేదు. మరమ్మతులు చేస్తే కనీసం రెండువేల ఎకరాలకు సాగు నీరందించే అవకాశం ఉంటుంది.

**పిచ్చిమొక్కలు పెరిగాయి సాయినిరెడ్డి, జైన**

జైన పరిధిలో పది చెరువులు ఉన్నాయి. ఎస్సారెస్పీ కాలువలు లేని రోజుల్లో వీటిపైనే ఆధారపడి రైతులు పంటలు పండించే వారు. దురదృష్టవశాత్తు ఈ చెరువులు దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోక చిన్నాభిన్నంగా మారాయి. కాలువలు మూసుకుపోయి.. పిచ్చి మొక్కలు పెరిగాయి. ప్రభుత్వం వీటిని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించాలి.

# పల్లె పాలనపై నిర్లక్ష్యం!

ఇబ్రహీంపట్నం: గ్రామాల్లో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యుల పదవీకాలం ముగియడంతో పంచాయతీల నిర్వహణ బాధ్యతలు ప్రభుత్వం ప్రత్యేకాధికారులకు అప్పగించింది. ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో గ్రామాల్లో రోడ్లపై పిచ్చిమొక్కలు పెరిగి, మురుగుకాల్వలు శుభ్రం చేయకపోవడంతో గ్రామస్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యంపై దృష్టిసారించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

**దోమల స్వైరవిహారం**

గ్రామాల్లో ప్రత్యేకాధికారులు శ్రద్ధ చూపకపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణ లోపం కనిపిస్తోంది. ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై పూర్తిస్థాయిలో దృష్టిపెట్టిన అధికారులు గ్రామాల్లో పరిశుభ్రతను విస్మరిస్తున్నారు. మండల కేంద్రంలో చిలుకవాగులో మురుగు ప్రవహిస్తుండటంతో గ్రామస్థులు, ముఖ్యంగా ఎస్సీ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామాల్లో మురుగుకాల్వలు శుభ్రం, రహదారుల వెంబడి పిచ్చిమొక్కలను శుభ్రం చేయకపోవడంతో దోమలు, దుర్వాసన వెదజల్లుతోంది. – న్యూస్‌టుడే, కొడిమ్యాల

**మురుగుతో దుర్వాసన**

గ్రామాల్లో వార్డులకు సరిపడా పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతో చెత్త సేకరణ, మురుగు కాల్వలు తీయక పోవడంతో అపరిశుభ్రంగా మారుతున్నాయి. పలు గ్రామాల్లో మురుగు కాల్వలు గతంలో నిర్మించినవే కావడంతో చాలా చిన్నవిగా ఉండి చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి. గ్రామశివారులోని కాలనీల్లో మురుగు కాల్వలను నిర్మించకపోవడంతో రహదారులపై మురుగు ప్రవహించడంతో పాటు నిల్వ ఉంటుండడంతో దుర్వాసన వెదజల్లి, దోమల వ్యాప్తి చెందుతున్నాయి. గ్రామాల్లో ప్రధాన రహదారుల పక్కనే చెత్తను పడేస్తున్నారు.

**కాలువ పూడ్చివేత..**

మండలంలోని పలుగ్రామాల్లో మురుగు కాలువల నిర్వహణ సక్రమంగాలేక గ్రామస్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. మండల కేంద్రంలో అతిపెద్ద మురుగు కాలువ జగ్గని ఒర్రెలో ప్లాస్టిక్ వ్యర్థాలతోపాటు చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్వాసన వ్యాపిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఎస్సీ కాలనీలోని ఓ వీధిలో కాలువ అసంపూర్తిగా నిర్మించడంతో మురుగు రోడ్డుపైకి ప్రవహిస్తుందని కాలనీవాసులు తెలిపారు. కొండగట్టు దిగువ ప్రాంతంలో వనభోజనాలకు వచ్చే యాత్రికులతో చెత్తాచెదారం పేరుకుపోతుంది. మల్యాల అడ్డరోడ్డు వద్ద కొందరు కాలువను పూడ్చివేయడంతో మురుగు నీరు వెళ్లడంలేదు.

**నిధుల లేమితో..**మండలంలో 32 గ్రామాలు ఉండగా పంచాయతీ పాలకవర్గాలు లేకపోవడంతో పల్లెల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. గ్రామాల్లో మురుగు కాల్వలను పరిశుభ్రం చేయకపోవడంతో దోమలవ్యాప్తి పెరిగింది. పారిశుద్ధ్య కార్మికులు పరిమితంగా ఉండటంతో గ్రామాల్లో ఇబ్బందులు తప్పడం లేదు. పంచాయతీలకు నిధుల లేమితో గ్రామాల్లో అభివృద్ధి పనులు, వీధి దీపాల నిర్వహణ, క్లోరినేషన్ సరిగా అమలు కావడం లేదు. అధికారులు, నాయకులు స్పందించి చర్యలు చేపట్టాల్సి ఉంది.

# అధిక భారం.. అడుగడుగునా ఛిద్రం



గోదావరిఖని : సుదీర్ఘ కాలం వాహనాలు నడిచేందుకు నిర్మించిన రాజీవ్ రహదారి తక్కువ సంవత్సరాల్లోనే మరమ్మతు దశకు చేరుకుంది. భారీ వాహనాలు, అధిక లోడు వాహనాలు తిరుగుతుండటంతో అతి తక్కువ కాలంలోనే గుంతలు పడటంతో పాటు తారు లేచిపోతోంది. ఉమ్మడి జిల్లాలో గుండ్లపల్లి నుంచి గోదావరిఖని వరకు వంద కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న రహదారిపై వాహనాల రద్దీ పెరగడంతో పాటు సామర్థ్యానికి మించి సరకు రవాణా చేస్తున్నారు.

**ఒకే వైపు ఎక్కువ**

గోదావరిఖని నుంచి కొత్తపల్లి వరకు విస్తరించి ఉన్న రాజీవ్ రహదారిపై హైదరాబాద్ వెళ్లే మార్గంలోనే ఎక్కువగా గుంతలు ఉన్నాయి. బసంత్‌నగర్, పెద్దపల్లి, సుల్తానాబాద్, తిమ్మాపూర్, గుండ్లపల్లి ప్రాంతాల్లో ఎక్కువ శాతం తారు లేచిపోయింది. దీంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది. వర్షాకాలంలో ఎక్కువ ప్రాంతాల్లో గుంతలు పడ్డాయి. నిర్వహణ సంస్థ ఇటీవలే కొన్ని చోట్ల మరమ్మతు చేసింది. ఈ చిత్రం పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్ సమీప కన్నాల వద్ద రాజీవ్ రహదారి. తారు లేచిపోయి పగుళ్లు చూపుతున్న రహదారి. మరి కొద్ది రోజుల్లో పూర్తిగా గుంత పడేందుకు ఆస్కారం ఉంది. అక్కడ రహదారి గట్టిదనం దెబ్బతింది. మరికొన్ని వాహనాలు అధిక బరువుతో నడిస్తే గుంతపడుతుంది.

రోడ్డు నిర్మాణంలో ఇవి పాటిస్తారు

ముందుగా మట్టి నమూనాలు పరీక్షిస్తారు.

వాహనాలు ఎన్ని తిరుగుతాయో అంచనా వేస్తారు.

రహదారి జీవిత కాలాన్ని కూడా అంచనా వేసి నిర్మిస్తారు.

ఇక్కడ కనిపిస్తున్న వాహనం సామర్థ్యానికి మించి సరకును తీసుకెళుంది. ఈ వాహనానికి ఉన్న బాడీ కంటే ఎక్కువ ఎత్తులో సరకు నింపుకొన్నారు. దీని ప్రభావంతో రహదారి దెబ్బతింటోంది.

రహదారి ఛిద్రానికి ఇవీ కారణాలు

ఉమ్మడి జిల్లాలో క్వారీలు, గ్రానైట్ పరిశ్రమలు అధికంగా ఉన్నాయి. ఎన్టీపీసీకి చెందిన బూడిదతోపాటు ఇసుక, కలప, ఉనుక, గ్రానైట్, ఇతర సరకుల లోడుతో నిత్యం వాహనాలు వెళ్తుంటాయి.

భారీ యంత్రాలను కూడా ఇదే రహదారిపై నుంచి రవాణా చేస్తున్నారు.

మూడో వంతు భారీ వాహనాలే..

రోజుకు 12 వేల వరకు వాహనాలు తిరుగుతుంటాయి.

భారీ వాహనాలు 4,500 వరకు ఉంటాయి.

సామర్థ్యానికి మించి వెయ్యి వాహనాలు వెళ్తున్నాయి.

సామర్థ్యానికి మించి రవాణా చేస్తే కేసులుసామర్థ్యానికి మించి రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తాం. ప్రతి వాహనానికి నిర్దేశిత సామర్థ్యం ఉంటుంది. వాహన బరువుతో కలిపి నిబంధనల మేరకు ఉన్న బరువు వరకు మాత్రమే రవాణా చేయాలి. అంతకంటే ఎక్కువగా సరకు ఉంటే చర్యలు తీసుకుంటాం. రహదారుల పై నిరంతరం తనిఖీలు చేస్తున్నాం. మా దృష్టికి వచ్చిన వాటిపై పరిశీలించి వాహనాలను సీజ్ చేస్తున్నాం. రంగారావు, జిల్లా వాహన తనిఖీ అధికారి

# ఖాళీల భర్తీ లేదు.. పరికరాలు లేవు



జగిత్యాల : ఉమ్మడి జిల్లాలో సర్వేశాఖలో పోస్టుల మంజూరు, ఖాళీల భర్తీ చేపట్టకపోవడంతో పాటు, అధునాతన పరికరాలు అందుబాటులో లేకపోవడంతో సకాలంలో దరఖాస్తులు పరిష్కారం కావడం లేదు. కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో 4 ఏడీ పోస్టులకు ఒక్కరే ఉండగా ఇతర జిల్లాల్లో ఇన్‌స్పెక్టర్లతో వెళ్లదీస్తున్నారు. సిరిసిల్ల జిల్లాలో ఇన్‌స్పెక్టర్ పోస్టు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ 2 పోస్టులు, సర్వేయర్లు, డిప్యూటీ సర్వేయర్ పోస్టులు 15, కంప్యూటర్ డ్రాఫ్ట్‌మెన్ 5, సీనియర్, జూనియర్ సహాయకులు తదితర అన్నీ కలిపి 9 పోస్టులు ఖాళీ ఉన్నాయి. సర్వేను వేగవంతంగా, కచ్చితత్వంతో పూర్తి చేసేందుకు అవసరమైన డీజీపీఎస్, హౌస్ స్టేషన్ తదితర అధునాతన పరికరాలు అందుబాటులో లేవు.

**హద్దుల కచ్చితత్వంపై నిర్లక్ష్యం**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భూముల రికార్డుల నిర్వహణ, క్రమబద్ధీకరణ కోసం ఆర్‌వోఆర్(రికార్డ్ ఆఫ్ రైట్), పట్టాదారు పాసుబుక్ చట్టం 1971 ఏర్పాటైంది. ఇందులో సర్వే, హద్దుల చట్టం 1923 ప్రకారం లావాదేవీలు జరిగిన భూములను ఎప్పటికప్పుడు సర్వే చేసి పటాలతో నవీకరించాలని స్పష్టంగా పేర్కొంది. అయితే భూముల క్రయవిక్రయాలు జరిగినపుడు, సదరు భూమి విస్తీర్ణానికి అనుగుణంగా రీసర్వే చేసి అధికారి ధ్రువీకరించిన పటం(సర్వే మ్యాప్) తప్పనిసరిగా దరఖాస్తుతో పాటు జతచేయాలి. సాదా బైనామా భూముల విషయంలో ఇదే నిబంధన వర్తిసుంది. నిజాం కాలంలో 1936లో మొదటి సారి ఆర్‌వోఆర్ చట్టం రాగా ఆ తరువాత పాత చట్టం రద్దవుతూ 1948, 1971, 2020లో కొత్త చట్టాలు ఏర్పాటయ్యాయి. ఈ క్రమంలో భూముల సాధారణ క్రయవిక్రయాలతో పాటు 1989, 1992, 2005, 2018తో పాటు పలుమార్లు వేల సంఖ్యలో సాదా బైనామా దరఖాస్తులు పరిష్కరించారు. రిజిస్ట్రేషన్ తదితర పత్రాల్లో హద్దుల వివరాలు నమోదు మినహా రీసర్వే చేసిన సబ్ డివిజన్ మ్యాపు జతపరచాలనే నిబంధనకు ప్రాధాన్యం ఇవ్వలేదు. యాజమాన్య హక్కులు బదిలీ అయినప్పటికీ హద్దుల విషయంలో కచ్చితత్వానికి అవకాశం లేకుండా పోయింది.

**సమస్యలు పరిష్కరించాలి**

**వెంకటరెడ్డి, సహాయ డైరెక్టర్, జగిత్యాల జిల్లా**

సర్వేశాఖలో సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తేనే కొత్త ఆర్‌వోఆర్ చట్టంతో ప్రజలకు ఆశించిన ప్రయోజనం చేకూరుతుంది. ఖాళీల భర్తీ, పోస్టుల మంజూరు చేపట్టడంతో పాటు జిల్లా, డివిజన్ కేంద్రాలతో పాటు, ప్రతి మండలానికి డీజీపీఎస్ మంజూరు చేయాల్సిన అవసరం ఉంది. సర్వేశాఖలో సమస్యలను డైరెక్టర్ సర్వే సెటిల్‌మెంట్, కమిషనర్ సర్వే ల్యాండ్ రికార్డ్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. సానుకూల చర్యలు చేపడుతుందని ఆశిస్తున్నాం.

**భూవివాదాలకు చెక్**

ప్రైవేటు సర్వేయర్లపై ఆధారపడితే ప్రభుత్వ భూముల విషయంలో అవకతవకలకు అవకాశం ఉండగా రైతులకు సైతం ఇబ్బందులు తప్పవని సర్వేవర్గాలు పేర్కొంటున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 29,21,527 ఎకరాల భూమి ఉండగా 2021లో ఉమ్మడి జిల్లాలో 1.12,517 మంది సాదా బైనామాకు దరఖాస్తు చేసుకున్నారు. సర్వే కోసం ఒక మండలంలో సగటున నెలకు 140 వరకు దరఖాస్తులు వస్తుండగా వీటిలో కేవలం 20 మాత్రమే పరిష్కరించడం సాధ్యమని బ్యూరో ఆఫ్ స్టాండర్డ్ ఆర్గనేషన్, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ 2014లో అందించిన సవివర నివేదికలో స్పష్టంగా పేర్కొనడం, సర్వేశాఖను పూర్తిస్థాయిలో సన్నద్ధత చేయాల్సిన అవసరాన్ని తెలియచేస్తోంది. కాగా రద్దయిన పాత రెవెన్యూ చట్టం స్థానంలో త్వరలో కొత్త ఆర్‌వోఆర్ చట్టం రానుండగా భవిష్యత్తులో భూవివాదాలకు అవకాశం లేకుండా, కొత్త చట్టంలో రీసర్వే నిబంధన అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో పోస్టుల మంజూరు, ఖాళీల భర్తీతో పాటు, అధునాతన పరికరాలు కేటాయించి, సర్వేశాఖను పూర్తిస్థాయి సామర్థ్యంతో సేవలు అందించే విధంగా సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉంది.

# పర్యవేక్షణ లోపం.. సంస్థలకు శాపం

కరీంనగర్ : ద్వితీయశ్రేణి నగరాల్లోనూ యువతకు ఉద్యోగావకాశాలను కల్పించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం కరీంనగర్‌లో ఐటీ టవర్‌ను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం కాంగ్రెస్ సర్కార్ కూడా ఐటీ రంగానికి పెద్దపీట వేయాలని నిర్ణయించింది. ప్రభుత్వాల నిర్ణయాలు మంచివే అయినా.. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపం ఐటీ సంస్థలకు శాపంగా మారింది. కరీంనగర్‌లోని ఐటీ టవర్‌లో సమస్యలపై కథనం.


కరీంనగర్‌లో ఉజ్వలపార్క్ సమీపంలో అయిదు అంతస్తులతో ఐటీ టవర్‌ను 2020లో అందుబాటులోకి తెచ్చారు. మూడు షిఫ్టుల్లో 2400 మందికి ఉద్యోగాలు కల్పించాలని మొదట నిర్ణయించినా.. పూర్తిస్థాయిలో కంపెనీలు రాలేదు. ప్రస్తుతం 11 సంస్థల కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. వీటిలో వంద మందికిపైగా ఉద్యోగులున్నారు.

ఈ భవనంలో రెండు లిఫ్టులు ఏర్పాటు చేశారు. రెండు రోజుల కిందట ఆ రెండూ పని చేయకపోవడంతో మెట్లెక్కి వెళ్లాల్సి వచ్చింది. ప్రస్తుతం ఒకటి మాత్రమే పని చేస్తోంది.

భవనంలో ఎలుకల బెడద ఉందని ఓ కంపెనీ నిర్వాహకుడు సాయి తెలిపారు. ఈ విషయాన్ని టీఎస్‌ఐఐసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదన్నారు. ఎలుకలతో దస్త్రాలు, ల్యాప్‌టాప్‌లకు నష్టం వాటిల్లితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు.

ఏసీ పని చేయడంలేదని నెల రోజులుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని, తాము వాడుతున్నవి ఖరీదైన ల్యాప్‌టాప్‌లని, అవి పాడయ్యే అవకాశముందని కంపెనీ నిర్వాహకుడు శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలిగితే జనరేటర్ ఉన్నా వాడటంలేదు. కొన్ని సంస్థలు ఒప్పందం చేసుకున్న కుర్చీల కంటే అధికంగా వాడుతున్నాయనే ఆరోపణలున్నాయి.



ఆ భవనం నిర్వహణకు మొదట్లో 20 మంది ఉండేవారు. ప్రస్తుతం ఏడుగురు మాత్రమే ఉన్నారు. ముగ్గురు భద్రతా సిబ్బంది, ఒకరు సూపర్‌వైజర్, ఒకరు స్కావెంజర్, ఇద్దరు హౌస్‌కీపింగ్ ఉన్నారు. గతంలో కార్యాలయాలన్నీ శుభ్రం చేసేవారు. ప్రస్తుతం ఆ విధానాన్ని తొలగించి కేవలం సంస్థల బయట మాత్రమే చేస్తున్నారు.

ఐటీ టవర్‌లో పూర్తి స్థాయి కంపెనీలు రాకపోవడంతో నిర్వహణ భారం తెలంగాణ రాష్ట్ర మౌలిక సదుపాయాల కల్పన సంస్థ(టీఎస్‌ఐఐసీ)పై పడుతోంది. కొన్ని కంపెనీలు అద్దె చెల్లించడంలో జాప్యం చేస్తున్నట్లు సమాచారం. ఇది కూడా ఇబ్బందిగా మారిందని అంటున్నారు.

**సమస్యలు పరిష్కరిస్తున్నాం**

లిఫ్టులు బాగు చేయిస్తున్నాం. ఏసీల విషయంలో కూడా అవసరమైన చర్యలు తీసుకుంటాం. జనరేటర్ అనేది విద్యుత్తు సరఫరా లేనప్పుడు మాత్రమే ఉపయోగిస్తాం. ఇప్పటికైతే ఆ అవసరం రాలేదు. కొన్ని కంపెనీలు ఒప్పందం కంటే అదనంగా సీట్లు ఉపయోగించడంపై విచారణ చేస్తాం. పద్మజ, జోనల్ మేనేజర్, టీఎస్‌ఐఐసీ

# విద్యార్థి దశలో వృత్తినైపుణ్యం

పెద్దపల్లి: కుటుంబ, ఆర్థిక పరిస్థితులతో ఉన్నత చదువులకు వెళ్లలేకపోయిన విద్యార్థులకు వృత్తివిద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు మెరుగవుతున్నాయి.. ఇంటర్మీడియట్ దశలోనే చదువుకుంటూనే పని చేయడం, పని చేస్తూనే నేర్చుకోవడం ద్వారా విద్యార్థులు నైపుణ్యం పెంచుకుంటున్నారు.. జిల్లావ్యాప్తంగా ఆరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, మూడు ప్రైవేటు శిక్షణ సంస్థలు వృత్తి శిక్షణ కోర్సులు అందిస్తున్నాయి. పదో తరగతి తర్వాత ఉపాధికి అవసరమైన శిక్షణ ఇస్తుండటంతో ఏటికేడు ఈ కోర్సుల్లో చేరేవారి సంఖ్య పెరుగుతోంది. చదువు పూర్తి కాగానే ఉపాధి పొందేలా కళాశాలలో ఉండగానే అనుభవ పూర్వక శిక్షణ ఇస్తున్నారు. ఏటా రెండు నెలల పాటు శిక్షణ తప్పనిసరి కావడంతో వివిధ సంస్థల్లో విద్యార్థులకు అధ్యాపకులే క్షేత్ర స్థాయిలో తర్ఫీదునిస్తున్నారు. చదివే కోర్సులు బట్టి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఓజేటీ(ఆన్ జాబ్ ట్రైనింగ్) అందిస్తున్నారు. ఈ ఏడాది 810 మంది విద్యార్థులు వృత్తివిద్యా కోర్సుల్లో చేరారు.

**చొరవ చూపితేనే విజయవంతం**

విద్యార్థులు క్షేత్ర స్థాయి శిక్షణలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగుల పనితీరు స్వయంగా పరిశీలించడం, రికార్డులు తయారు చేయడం, వివిధ పత్రాలను ఫైలింగ్ చేయడంతో పాటు ప్రాధాన్యతా క్రమంలో రికార్డుల నిర్వహణ వంటి పనులు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం సంబంధిత ప్రభుత్వ కార్యాలయంలో ఒక అధికారిని నియమించి, ఓజేటీకి వచ్చిన విద్యార్థులకు కార్యాలయ పనితీరును వివరించాల్సి ఉంటుంది. గతంలో ఈ ప్రక్రియ సజావుగానే సాగేది. కొత్త జిల్లాల ఆవిర్భావం తర్వాత విద్యార్థులను పట్టించుకొనే పరిస్థితి లేకుండా పోయింది. ఫలితంగా విద్యార్థులు ఓజేటీ శిక్షణ కోసం ప్రైవేటు



సంస్థలకు డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది.

ఈ పరిస్థితిని మార్చి విద్యార్థులకు వారి కోర్సులకు అనుగుణంగా వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఓజేటీ అందించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

**ఎనిమిది కోర్సులు**

జిల్లాలోని పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వృత్తివిద్యా కోర్సులు నిర్వహిస్తున్నారు. ఆఫీస్ అసిస్టెంట్ షిప్, అకౌంటింగ్ అండ్ ట్యాక్సేషన్, కంప్యూటర్ గ్రాఫిక్ అండ్ యానిమేషన్, ఎలక్ట్రిషియన్ టెక్నీషియన్, మెడికల్ ట్యాబ్ టెక్నీషియన్, ఫిజియోథెరపీ, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ ఫర్ ఉమెన్, కంప్యూటర్ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఆఫీస్ అసిస్టెంట్‌షిప్ కోర్సు చదివిన వారు నేరుగా స్టెనోగ్రాఫర్ ఉద్యోగాలకు అర్హత సాధిస్తారు. మిగిలిన కోర్సులకు సంబంధించి అదే కళాశాలలోనే బ్రిడ్జి కోర్సులు సమాంతరంగా చదవాల్సి ఉంటుంది.

**కొత్త విషయాలు నేర్చుకుంటున్నా..**

క్షేత్ర స్థాయి శిక్షణ ఎన్నో కొత్త విషయాలు నేర్పిస్తోంది. పాఠాలకు, పని పరిస్థితులకు తేడా స్పష్టంగా ఉంది. స్వయం పరిశీలన, పని చేయడం చక్కటి అనుభూతినిస్తున్నాయి. ఇంటర్ పూర్తయ్యాక ఉద్యోగం రాకపోయినా, ఉన్నత చదువులకు, స్వయం ఉపాధికి ఓజేటీ శిక్షణ ఉపయుక్తంగా ఉంటుంది. ప్రైవేటు రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరుకుతాయి.

నవ్య, కంప్యూటర్ గ్రాఫిక్స్ అండ్ యానిమేషన్ రెండో సంవత్సరం

**పనులపై అవగాహన కలిగింది**

ఒక కార్యాలయంలో నిర్వహించాల్సిన పనులపై అవగాహన కలిగింది. కార్యాలయ తీరును బట్టి పని పరిస్థితులు వేరుగా ఉండవచ్చు. నిర్వర్తించాల్సిన బాధ్యతల మౌలిక స్వరూపం మాత్రం మారదు. ఓజేటీ శిక్షణ మొత్తం ప్రధానమైన ప్రాథమికాంశం చుట్టే తిరిగింది. అక్షిత, ఆఫీస్ అసిస్టెంట్‌షిప్ మొదటి సంవత్సరం

# నిదరోతున్న.. నిఘా నేత్రం!

మెదక్ : పెద్దశంకరంపేట వేంకటేశ్వర కాలనీలో అక్టోబరు 29న తాళం వేసిన ఇంటిలో 8 తులాల బంగారం, 30 తులాల వెండి ఆభరణాలు దొంగలు అపహరించుకుపోయారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన సీఐ రేణుక, ఎస్సై శంకర్ సీసీ కెమెరా ఫుటేజీ, చరవాణి కాల్ డేటా ఆధారంగా ఈనెల 3వ తేదీన నిందితులను పట్టుకుని సొత్తు స్వాధీనం చేసుకున్నారు. శివ్వంపేట మండలం గోమారంలో సెప్టెంబరు 4న గుర్తుతెలియని వ్యక్తి దారుణ హత్యకు గురయ్యారు. పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా కేసు ఛేదించారు. ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఇలా నేరాల ఛేదనలో సీసీ కెమెరాలు కీలకంగా ఉపయోగపడ్డాయి. వీటి ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ, బిగించేలా చర్యలు తీసుకుంటున్న పోలీస్‌శాఖ ఆ తర్వాత వాటి నిర్వహణను పట్టించుకోవడం లేదు. దీంతో పరిస్థితి మళ్లీ మొదటికి వస్తోంది. జిల్లాలో ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కెమెరాలు ఎలా పని చేస్తున్నాయో పరిశీలించింది ఆ వివరాలు..

**దాతల సహకారంతో...:** మండల కేంద్రమైన పెద్దశంకరంపేటలో దాతల సహకారంతో పలు కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ పోలీసులే చూస్తున్నారు. గ్రామాల్లో సర్పంచుల ఆధ్వర్యంలో రెండేళ్ల కిందట ఏర్పాటు చేసినవి చాలా చోట్ల పనిచేయడం లేదు.

**మూడు గ్రామాల్లో:**

చేగుంట మండలంలో మూడు గ్రామాల్లో గతంలో వీటిని ఏర్పాటు చేశారు. ఎక్కడా సక్రమంగా పనిచేయడం లేదు. చేగుంట పట్టణంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 36 కెమెరాలు బిగించారు. ప్రస్తుతం అందులో సగం పనిచేయని పరిస్థితి. జనసంచారం ఉన్న చోట ఏర్పాటు చేసినవి పనిచేయడం లేదు. గాంధీ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కెమెరాలకు అడ్డంగా ఓ పార్టీకి చెందిన ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. చేగుంట నుంచి గజ్వేల్ వెళ్లే మార్గంలో జాతీయ రహదారి వంతెన వద్ద ఏర్పాటుచేసిన కెమెరా నేలచూపు చూస్తోంది. మక్కరాజుపేట, వడియారం గ్రామాల్లో ఏర్పాటు చేసినవి పనిచేయడం లేదు.

**అలంకారప్రాయంగా...:**

నర్సాపూర్ పట్టణంలో 28 సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయి. ఆరు పనిచేయడం లేదు. వీటిని మరమ్మతులకు పంపారు. నర్సాపూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న మూడు కెమెరాలు అలంకారప్రాయంగా మారాయి. ఇక్కడ తరచూ దొంగతనాలు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడంలేదు. కల్లు దుకాణం సమీపంలో ఏర్పాటు చేసినవి కొన్ని నెలలుగా పని చేయడం లేదు. ఇటీవల ఓ మహిళ హత్య కేసుకు ఈ ప్రాంతం నుంచే వ్యూహరచన చేసిన విషయం తెలిసిందే. మరో ఆరు కెమెరాలకు ప్రతిపాదనలు పంపారు.

**రూ.కోట్లు వెచ్చించినా...:**

తూప్రాన్ పురపాలికతో పాటు, మండలంలో మూడేళ్ల కిందట గడా నిధులు రూ.2 కోట్లతో, స్థానిక పోలీసులు రూ.15 లక్షలు వెచ్చించి పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పట్టణంలో 118 కెమెరాలు ఉండగా, 80 మాత్రమే పని చేస్తున్నాయి. మరమ్మతులకు గురైనవాటిని బాగు చేయించడం లేదు.

**తీగలు తెగి...:**

మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లో రూ.5 లక్షలతో 20 కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పని చేయడం లేదు. ముప్పిరెడ్డిపల్లిలో రూ.6 లక్షలతో 26 ఏర్పాటు చేయగా తీగలు తెగిపోయాయి. కూచారంలో రూ.3 లక్షలతో 15 ఏర్పాటు చేసినా, పనిచేయకపోవడంతో తొలగించారు. పనిచేయని వాటికి మరమ్మతులు చేపట్టాలి.

# కలిసికట్టుగా ఛార్జింగ్

హైదరాబాద్: విద్యుత్తు వాహనాల వినియోగాన్ని పెంచేందుకు టీజీ రెడ్కో (తెలంగాణ పునరుత్పాదక శక్తి అభివృద్ధి సంస్థ), హైదరాబాద్ మహానగరపాలక సంస్థ (జీహెచ్ఎంసీ) కలిసికట్టుగా ముందుకెళ్తున్నాయి. పాదబాటలు, రహదారుల పక్కనున్న స్థలాలను జీహెచ్ఎంసీ ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు కేటాయిస్తుండగా, ఆయా ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు, కార్ల ఛార్జింగ్‌కు అవసరమయ్యే ఏర్పాట్లను రెడ్కో పూర్తి చేస్తోంది. ఇప్పటికే 40 చోట్ల కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. మరో 43 ప్రాంతాల్లో ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటు చివరి దశలో ఉంది. విద్యుత్తు శాఖ నుంచి ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, ఇతర అనుమతులు పూర్తవ్వాల్సి ఉందని జీహెచ్ఎంసీ స్పష్టం చేస్తోంది. మొదటి దశలో మొత్తం 99 ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని రెడ్కో, జీహెచ్ఎంసీ లక్ష్యంగా పెట్టుకున్నాయి. ప్రస్తుతం 83 చోట్ల ఛార్జింగ్ యూనిట్ల ఏర్పాట్లు పూర్తవగా, 43 ఇప్పటికే మొదలయ్యాయి. మిగిలినవి వేర్వేరు దశల్లో ఉన్నాయి.



**నామమాత్రపు రుసుంతో..**
కొత్త ఛార్జింగ్ కేంద్రాలను ప్రజలు నామమాత్రపు రుసుంతో ఉపయోగించుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. కారుకు అరగంటలో ఛార్జింగ్ పూర్తవుతుందని తెలిపారు. 'టీఎస్ ఈవీ' అనే యాప్‌ను రూపొందించామని, దీని సేవలు త్వరలో అందుబాటులోకి వస్తాయంటున్నారు.

**పనిచేస్తున్న కేంద్రాలు..** వైదేహినగర్ బస్టాపు, శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం, ఆల్విన్‌కాలనీ ఎక్స్ రోడ్డు, డీఎల్ఎఫ్ భవనం ఎదురుగా, స్వామి వివేకానంద పార్కు (ఎన్జీవో కాలనీ), సచివాలయం నగర్ కమ్యూనిటీ హాల్, డెలాయిట్ మీనాక్షి ఎదురుగా, నాగోల్ సర్వీసు రోడ్డుపై మెట్రో పిల్లరు సీ819 వద్ద, సచివాలయంనగర్ కమాన్ వద్ద, జడ్పీహెచ్ఎస్ స్కూలు వెనక, ఇంపీరియల్ హోటల్ ఎదురుగా, హబ్సిగూడ మెట్రో పిల్లరు సీ929 వద్ద, షెల్ పెట్రోలు పంపు పక్కన, వివేకవర్ధిని విద్యాసంస్థల వద్ద, చర్లపల్లి బస్టాపు పక్కన, జాన్సన్ గ్రామర్ స్కూల్ ఎదురుగా, విజయ గార్డెన్ కాలనీ పార్కు వద్ద తదితర ప్రాంతాల్లో ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి.

# విప్రో పక్కన ఇల్లు కట్టేసుకుంటే పోలా!

హైదరాబాద్ : నగరంలో సర్కారు స్థలాలు ఖాళీగా ఉంటే చాలు.. అక్రమార్కులు గుడిసెలు.. ఇళ్లు కట్టేసుకుంటున్నారు. తప్పుడు పత్రాలు చూపించి ప్రహరీలు నిర్మిస్తున్నారు. తాజాగా ఐటీకారిడార్‌లోని విప్రో సంస్థ (%Wipro%) కార్యాలయం పక్కనే కొందరు గృహ నిర్మాణం చేపట్టారు. స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి సిబ్బందితో వెళ్లి వంద నిర్మాణాలను కూల్చివేయించారు. అక్కడున్న వారిని ప్రశ్నించగా... ఇళ్లు కట్టండంటూ తమకు డబ్బులిచ్చారని, వారెవరో తెలీదని సమాధానమిచ్చారు. పనులు ఆపేసి వెళ్లండంటూ వారిని అధికారులు హెచ్చరించారు. నాలుగు ఎకరాల్లో పనులు మొదలు పెట్టి.. మరో పది ఎకరాలను నాగళ్లతో దున్ని చదును చేసినట్టు గుర్తించారు. రూ.1400 కోట్ల విలువైన భూములను ఆక్రమించేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.

**హౌసింగ్ బోర్డుకు అప్పగించిన విషయం తెలుసుకుని...**
వట్టినాగులపల్లి సర్వే నంబరు 132లోని 120 ఎకరాల ప్రభుత్వ భూమిలో విప్రో సంస్థకు 70ఎకరాలను సర్కారు అప్పట్లో విక్రయించింది. మిగిలిన 50 ఎకరాలను ప్రస్తుత టీజీఐఐసీకి కేటాయించింది. టీజీఐఐసీ అధికారులు ఇటీవలే హౌసింగ్‌బోర్డుకు అప్పగించారు. సర్వే నిర్వహించి హద్దులు గుర్తించారు. దీన్ని గమనించిన కొందరు వేగంగా పావులు కదిపారు. వారం పదిరోజుల నుంచి రాత్రివేళ చదును చేయడం, పునాదులు తవ్వడం, గజాల చొప్పున ప్లాట్లను విభజించి ముగ్గులు పోయడం వంటివి చేశారు. ఇళ్లను వేగంగా నిర్మించి అందులో చేరేందుకు కార్యాచరణ రూపొందించారు.

**అక్రమార్కుల వెనుక ఎవరు?**
ఇళ్ల నిర్మాణాల వెనుక ఎవరున్నారనే అంశంపై రెవెన్యూ అధికారులు సమాచారం సేకరిస్తున్నారు. ఎవరన్నది తెలియకపోతే పోలీసులకు ఫిర్యాదు ఇవ్వాలని యోచిస్తున్నారు. భూములను ఆక్రమించి, పట్టాలుగా విక్రయించే ముఠా తెరవెనుక ఉందేమోనని అనుమానిస్తున్నారు. ప్లాట్లను ఇప్పటికే కొందరికి విక్రయించినట్టు తెలుసుకున్నారు. వారిని పిలిపించి ఏ పత్రాలు ఇచ్చారో పరిశీలించనున్నారు. మరోవైపు ఈ వ్యవహారం వెనుక మీడియా పేరు చెప్పుకొంటూ ప్రభుత్వ కార్యాలయాల్లో దర్పం ప్రదర్శిస్తున్న కొందరు వ్యక్తులున్నట్లు తెలిసింది.

# ఫ్యాబ్ సిటీలో ఐటీ సంస్థలు.. పరిశ్రమలు

హైదరాబాద్ : తుక్కుగూడ ఫ్యాబ్‌సిటీలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ, పరిశ్రమలశాఖ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఫ్యాబ్ సిటీ ప్రత్యేక ఆర్థిక మండలిలోని 922 ఎకరాలను కేంద్ర ప్రభుత్వం డీ-నోటిఫై చేయడంతో ఆయా విభాగాల అధికారులు అందులో వాటిని ఏర్పాటు చేసేందుకు అనువుగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. ఫ్యాబ్‌సిటీకి



15 కిలోమీటర్ల దూరంలోనే ఫ్యూచర్ సిటీ నిర్మాణమవుతున్న నేపథ్యంలో మధ్యలో మరిన్ని ఐటీ సంస్థలు, పరిశ్రమలు, ఎలక్ట్రానిక్స్ సంస్థలతో అనుసంధానించేందుకు కార్యాచరణ రూపొందించారు. మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కందుకూరు, షాబాద్ మండలాల్లో ఇప్పటికే బహుళజాతి సంస్థలు పరిశ్రమలను నెలకొల్పడంతో ఫ్యాబ్‌సిటీలో ఇలాంటి పరిశ్రమలకు అనువైన పరిస్థితులను కల్పిస్తున్నారు.

# ప్రకృతి పులకింత.. ప్రత్యేకతల కలబోత



హైదరాబాద్: అవుటర్ రింగ్‌రోడ్డు దరి..హిమాయత్‌సాగర్ చెంత సిద్ధం చేసిన కొత్వాల్‌గూడ ఎకో పార్కు సందర్శకుల కోసం సిద్ధమవుతోంది. ప్రజాపాలన ఉత్సవాల్లో భాగంగా డిసెంబరు 9న దీన్ని ప్రారంభించేందుకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ చకచక ఏర్పాట్లు చేస్తోంది. వీటితో పాటు హెచ్ఎండీఏ పరిధిలో రూపకల్పన చేస్తున్న కాలనీ పార్కులనూ అందుబాటులోకి తేనున్నారు. ఐటీ కారిడార్, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అనుసంధానం చేసే ఔటర్ రింగ్‌రోడ్డుకు ఆనుకొని సుమారు 85 ఎకరాల విస్తీర్ణంలో కొత్వాల్‌గూడ ఎకో పార్కుకు రెండేళ్ల కిందట హెచ్ఎండీఏ శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ పార్కులో తొలిదశ పనులు పూర్తయ్యాయి. మొత్తం రూ.300 కోట్ల అంచనా వ్యయంతో దీనిని అంతర్జాతీయ స్థాయిలో నిర్మిస్తున్నారు.

**మొదటి విడతలో..**ఎకో పార్కులో తొలి విడతలో ఎలివేటెడ్ వాక్‌వే, పక్షుల గ్యాలరీ, వివిధ రకాల పూలతో కూడిన ఉద్యానవనం, బటర్‌ఫ్లై పార్కు, పార్కులో అందంగా తీర్చిదిద్దిన పచ్చికబయళ్లను సందర్శకులకు అందుబాటులోకి తేనున్నారు.

**రెండో దశలో..**
ఫేజ్-11 కింద అక్వేరియం, థీమ్ పార్కులు, ఇతర ప్రకృతి అందాలను పర్యాటకులకు కనువిందు చేయనున్నాయి.

**ఇవీ ప్రత్యేకతలు...** అందమైన ప్రకృతి రమణీమైన ల్యాండ్‌స్కేపింగ్
దేశంలోనే అతి పెద్దదైన ఏవియరీ
సముద్ర జీవులతో అక్వేరియం
2.5 కిలోమీటర్ల దూరంతో కూడిన ఎలివేటెడ్ వాక్ ప్రాంతం
వివిధ రకాల ఆటలు, సాహసాలతో అడ్వెంచర్ జోన్
అవుటర్ రింగ్‌రోడ్డుకు అటు, ఇటు రాకపోకలు సాగించేందుకు సస్పెన్షన్ వంతెన లగ్జరీ రిసార్టుతో పాటు మినీ కన్వెన్షన్ సెంటర్

# బియ్యం దందాలో భిన్నకోణాలు



భగత్‌నగర్: రేషన్ బియ్యం దందా జిల్లాలో యథేచ్ఛగా సాగుతోంది. అధికారులు, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు నిరంతరం నిఘా పెట్టినా.. అక్రమాలు ఆగడంలేదు. వీటిని సమూలంగా నియంత్రించాలంటే కీలెరిగి వాతపెట్టడం అన్న చందంగా మూలాలపై దృష్టి సారించాల్సిన అవసరముంది. పోలీసులు, పౌరసరఫరాల శాఖాధికారులు సమన్వయంతో పని చేస్తే ఈ దందాను పూర్తి స్థాయిలో నిర్మూలించవచ్చు. ఎక్కడెక్కడ అక్రమాలు జరుగుతున్నాయి. అధికారులు ఏం చేయాలో 'న్యూస్‌టుడే' కథనం.

**ఆ మూడింటిని నియంత్రిస్తేనే..**
రేషన్ బియ్యం దందాకు మూడు ప్రాంతాలు ఆయువు పట్టుగా ఉంటున్నాయి. అవి వాహనాలపై తిరుగుతూ బియ్యం కొనుగోలు చేస్తున్న వ్యాపారులు, రేషన్ దుకాణాలు, మండల స్థాయి నిల్వ కేంద్రాలు. వీటి(ఎంఎల్ఎస్)పై నిరంతరం నిఘా తనిఖీలతో జిల్లాలో జరుగుతున్న బియ్యం అక్రమ రవాణాకు తెరపడే అవకాశముంది.

**1.రిజిస్ట్రేషన్ లేని వాహనాలు..**
నగరంలో వీధి వీధికి తిరుగుతూ నూకలు కొంటాం అంటూ తిరిగే చిరు వ్యాపారులు.. రిజిస్ట్రేషన్ లేని వాహనాలను బియ్యం కొనుగోలుకు ఉపయోగిస్తున్నారు. దీంతోవారు స్వేచ్ఛగా వ్యాపారం సాగిస్తున్నారు. ప్రతి వీధి వీధికి తిరుగుతూ సేకరించిన బియ్యాన్ని నగరంలోని ఓ బడా వ్యాపారికి విక్రయిస్తున్నారు. సదరు వ్యాపారి కొందరు రైస్ మిల్లర్లతో వ్యాపార ఒప్పందాలు చేసుకోవడానికి గణేశ్‌నగర్‌లో ప్రత్యేకంగా ఓ కార్యాలయాన్నే ఏర్పాటు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వీరిపై దృష్టి పెట్టి.. వారిపై చర్యలు తీసుకోవాలి.

**2.తక్కువగా తూకం వేస్తూ..**
కొందరు రేషన్ దుకాణాల డీలర్లు లబ్ధిదారులకు గోనె సంచితో బియ్యం తూకం వేస్తున్నారు. సంచి బరువు సుమారు 400 నుంచి 500 గ్రాముల వరకు ఉంటుంది. ఓ కుటుంబంలో నలుగురు ఉంటే వారికి ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున 24 కిలోల బియ్యం రావాలి. అంటే ఒక్క తూకానికి అర కిలో బియ్యం వరకు దండుకుంటున్నారు. ఇలా పోగేసిన బియ్యాన్ని పక్కా ప్రణాళికతో వ్యాపారులకు విక్రయిస్తున్నారు. రేషన్ దుకాణానికి బియ్యం నిల్వలు తీసుకొచ్చిన లారీ నుంచే నేరుగా వ్యాపారులకు బియ్యం అన్‌లోడ్ చేస్తున్నారు. బియ్యం తరలిస్తున్న లారీలకు జీపీఎస్ బదులు సీసీ కెమెరాలను అమర్చినట్లయితే.. ఏ దుకాణాల్లో ఎంతమేర బియ్యం దించారన్న విషయాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించొచ్చు.

**3.మండల స్థాయి నిల్వల కేంద్రంలో..**
మండల స్థాయి బియ్యం నిల్వ కేంద్రాలు దందాలో ఓ భాగంగా మారాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో డీలర్‌కు బియ్యం తూకం వేసి బయోమెట్రిక్ తీసుకొని ఇవ్వాల్సి ఉంటుంది. కానీ మండల స్థాయి నిల్వ కేంద్రం నుంచి డీలరు ఎదుట తూకం వేయకుండానే బియ్యం సరఫరా జరుగుతోంది. దీంతో 50 కిలోల బియ్యం బస్తాకు సంచి బరువు 500 గ్రాములు తగ్గుతోంది. అలాగే తూకం వేయకుండా నేరుగా బియ్యం ఇవ్వడంతో చిరిగిన బస్తాలు వస్తున్నాయి. చిరిగిన బస్తాల్లో కిలో నుంచి 5 కిలోల వరకు డీలర్‌కు తక్కువ వస్తోంది. కేంద్రాల్లో సీసీ కెమెరాలు బిగించి ప్రతి డీలర్ తూకం వేసిన బియ్యం తీసుకువెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

**ఈ ఆర్థిక సంవత్సరంలో...**
నమోదైన కేసులు : 109 మందిపై
పట్టుకున్న బియ్యం : 4140 క్వింటాళ్లు
బహిరంగ మార్కెట్‌లో విలువ : రూ.85,11,440
వాహనాల సీజ్ : 69
వాటి విలువ : రూ.30,66,000

# సాగునీరు అందేదెప్పుడో?

మల్లాపూర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కోసం విలువైన భూములను త్యాగం చేసిన నిర్వాసితులకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. పునరావాస గ్రామాల రైతుల పంటలకు సాగునీరు అందక అష్టకష్టాలు పడుతున్నారు. గ్రామాల రైతులు పలుమార్లు ఎస్సారెస్పీ అధికారులతో పాటు ప్రజాప్రతినిధులకు విన్నవిస్తున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. మల్లాపూర్ మండలంలో ఎస్సారెస్పీ ఆయకట్టు చివరి గ్రామాలైన సంగెం, శ్రీరాంపూర్, రత్నాపూర్, కొత్తదాంరాజుపల్లి, పాతదాంరాజుపల్లి, వెంపల్లి, వెంకట్రావుపేట గ్రామాల్లోని వందలాది ఎకరాలకు ఏళ్ల తరబడి సాగునీరు అందకపోవడంతో ప్రత్యామ్నాయ వనరులతో పంటలను సాగు చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఎస్సారెస్పీ ప్రధాన కాలువ నుంచి డి29 కాలువ ద్వారా మల్లాపూర్ మండలంలోని పలు గ్రామాలకు సాగునీటిని సరఫరా చేస్తున్నారు. కాల్వ పైభాగంలో ఉన్న ముత్యంపేట, రాఘవపేట, సిరిపూర్, చిట్టాపూర్, సిరిపూర్ గ్రామాల వరకు మాత్రమే సాగునీరు వస్తుంది. వర్షాలు సమృద్ధిగా కురిసి వ్యవసాయబావులు నిండితే తప్ప పంటలను సాగుచేసుకోలేని స్థితిలో అన్నదాతలు ఉన్నారు. నాలుగు సంవత్సరాల కిందట మండలంలోని మొగిలిపేట పెద్దచెరువు కిందిభాగంలో కాలువ లైనింగ్ పనులకు ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేయగా పనులు దక్కించుకున్న గుత్తేదారు రెండు కిలోమీటర్ల మేర పనులు చేపట్టి మిగతా పనులు వదిలేశారు. లైనింగ్ లేకపోవడం, భారీ వర్షాలకు



గండ్లు పడటంతో కాలువలోకి వచ్చిన వర్షం నీరు గోదావరిలోకి చేరుతోంది. ఆయకట్టు చివరి పరిధిలో కాలువలకు లైనింగ్ పనులు చేపట్టడంతో పాటు డి29 కాలువ ఎగువ భాగంలో ఉన్న తూంలకు షట్టర్లు అమర్చితే సాగునీరు అందే పరిస్థితులున్నాయి. ఇటీవల ఎస్సారెస్పీ డీఈ, ఈఈల బృందం కాలువలను పరిశీలించింది. అధిక వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాల్లో మరమ్మతు చేపట్టేందుకు అధికారుల బృందం ప్రణాళికను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపింది. వచ్చే ఖరీఫ్ సీజన్‌లోపు పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకొంటున్నట్లు ఎస్సారెస్పీ ఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. **ఇప్పటికీ న్యాయం జరగడం లేదు..నాలూరి మోహన్, రైతు, శ్రీరాంపూర్**ఏళ్ల తరబడి చివరి ఆయకట్టుకు ఎస్సారెస్పీ సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నాం. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చినా ఇప్పటికీ న్యాయం జరగడంలేదు. అధికారులు సాగునీరు అందేలా చూడాలి.

# మురుగుశుద్ధికి అడుగులు

హైదరాబాద్: మహానగరంలో మురుగుశుద్ధికి వేగంగా అడుగులు పడుతున్నాయి. మరో 527 ఎంఎల్‌డీల ప్రాజెక్టులు అందుబాటులోకి రానున్నాయి. డిసెంబరు 3న సీఎం రేవంత్‌రెడ్డి నాగోలు, ఫతేనగర్, మీరాలం, ఖాజాకుంట, పటేల్ చెరువు, సఫీల్‌గూడ మురుగునీటి శుద్ధి కేంద్రాలతోపాటు 19 రిజర్వాయర్లను ప్రారంభించనున్నారు. ప్రస్తుతం నగరంలో 31 కేంద్రాలు ఉండగా.. రోజుకు 928 ఎంఎల్‌డీల మురుగునీరు శుద్ధి అవుతోంది. మూసీ ప్రక్షాళనలో భాగంగా వంద శాతం శుద్ధి చేసిన మురుగుజలాలను నదిలోకి వదలడమే లక్ష్యంగా ఎస్టీపీల నిర్మాణం చేపట్టారు.

**అత్యాధునిక సాంకేతికత..:** జలమండలి ఈ ఎస్టీపీలను సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్ (ఎస్‌బీఆర్) సాంకేతికతో నిర్మించింది. నిర్వహణ వ్యయం




కూడా తక్కువ కావడంతో ఉన్నతాధికారులు ఈ సాంకేతికతకు మొగ్గు చూపుతున్నారు. మురుగునీటిలో వ్యర్థాల శుద్ధిలో అత్యధిక సామర్థ్యం ఉండటం, బహుముఖంగా పనిచేయడంతోపాటు నిర్దేశించిన ప్రమాణాల మేరకు శుద్ధి చేసిన జలాలను బయటకు పంపుతుంది. సింగిల్ బ్యాచ్ రియాక్టర్‌లో పనిచేస్తుంది. స్లడ్జ్‌లో ఉండే బ్యాక్టీరియా కీలకంగా వ్యవహరిస్తుంది.

# ఆసుపత్రులు పెరిగితేనే సేవలు మెరుగు

కరీంనగర్ : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఆరోగ్యశ్రీ ప్రైవేటు ఆస్పత్రుల సంఖ్యను పెంచుతామనే ప్రకటనతో ఉమ్మడి జిల్లా వాసుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో 64,534 శస్త్రచికిత్సలు జరిగాయి. అదే 2023 జనవరి నుంచి డిసెంబరు 8 వరకు 60,627 మంది ఉచిత వైద్యాన్ని పొందారు.రూ.10 లక్షల పెంపు తరువాత ఖరీదైన వైద్యం అవసరం అయినవారికి చికిత్సపరంగా ఊరట లభిస్తోంది. జగిత్యాల జిల్లాలో ఇద్దరు, కరీంనగర్‌లో ఒకరు ఈ పెంపు ప్రయోజనాన్ని అందుకున్నారు. రూ.9.25 లక్షల వ్యయంతో కరీంనగర్‌కు చెందిన సందేశ్ అవయవ మార్పిడి చేసుకున్నారు. జగిత్యాలకు చెందిన ఇద్దరు రూ.10 లక్షలకుపైగా సాయం పొందారు.

**కొత్తగా 163 వ్యాధులకు..**
ఆరోగ్యశ్రీ పథకాన్ని ఉమ్మడి రాష్ట్రంలో 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రవేశపెట్టింది. ప్రస్తుత ప్రభుత్వం 1375 రకాల చికిత్సలకు సగటున 25 శాతం ధరలు పెంచి.. కొత్తగా 163 వ్యాధులను ఇందులో చేర్చింది. గతంలో ఈ పథకం ద్వారా 1672 రకాల ప్యాకేజీల సేవలు అందగా.. పెంచినవాటితో మొత్తం 1835కి పెరిగింది. కొందరికి రేషన్‌కార్డు లేనివారికి ముఖ్యమంత్రి కార్యాలయ అనుమతితో రోగికి చికిత్స అందిస్తున్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డులున్నవారికి సైతం వర్తింపజేస్తున్నారు.

**తోడ్పాటు అందిస్తున్నాం**
**విజయ్‌కుమార్ మేనేజర్, ఉమ్మడి జిల్లా**
ఆరోగ్యశ్రీ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి సేవలందించేందుకు తోడ్పాటునిస్తున్నాం. నాలుగు జిల్లాల పరిధిలో ప్రస్తుతం 78 మంది ఆరోగ్య మిత్రలున్నారు. ప్రతి ఆస్పత్రి వద్ద వారి పేరు, వివరాలుంటున్నాయి. ఉచిత సహాయ నంబరు 104ను సంప్రదించినా సేవల గురించి సమాచారమందిస్తారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా మరిన్ని ఆస్పత్రుల సంఖ్య పెరిగే వీలుంది.

**పెరిగితేనే ప్రయోజనం..**పెద్దపల్లి జిల్లాలో కేవలం ఒక్క ప్రైవేటు ఆస్పత్రి మాత్రమే పేదలకు ఉచితంగా సేవలందిస్తోంది. మిగతావి ఆసక్తి చూపడం లేదు.నాలుగు జిల్లాల పరిధిలో మొత్తం 1300కుపైగా ప్రైవేటు ఆస్పత్రులున్నాయి. ఇందులో కనీసం అయిదోవంతు ఆసుపత్రుల్లోనూ ఆరోగ్యశ్రీ లేదు.జమ్మికుంటలో ఇటీవల చిన్నపిల్లల ఆస్పత్రి ఆరోగ్యశ్రీలో చేరింది. కొన్నిరకాల చికిత్సల ఆస్పత్రులు జిల్లాల్లో లేక ఇబ్బంది నెలకొంది.

# చలిలోనూ పెరిగిన విద్యుత్తు వినియోగం

హైదరాబాద్: రాష్ట్రంలో చలి గజగజ వణికిస్తోంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడం, శీతలగాలులు వీస్తుండటంతో వాతావరణం పొడిగా మారింది. దీంతో విద్యుత్తు డిమాండ్ తక్కువగా ఉంటుందనే అంచనాలకు భిన్నంగా రాష్ట్రంలో కొద్దిరోజులుగా పెరిగింది. గతేడాది నవంబరు 26న 9170 మెగావాట్ల డిమాండ్ ఉంటే.. ఈసారి 10698 మెగావాట్లకు పెరిగింది. గతేడాది నవంబరు 27న 9387 మెగావాట్ల డిమాండ్ నమోదైతే... ఈ ఏడాది ఇదే రోజు 10843 మెగావాట్ల డిమాండ్ రికార్డైంది.


వినియోగం డబుల్ సెంచరీ దాటింది.. ఈ నెల 26, 27 తేదీల్లో 200.83, 200.80 మిలియన్ యూనిట్ల వినియోగం రాష్ట్రంలో నమోదైంది. గతేడాది ఇవే రోజుల్లో 192.37, 195.97 మిలియన్ యూనిట్లు మాత్రమే నమోదైంది. హైదరాబాద్‌లోనూ..విద్యుత్తు డిమాండ్ గతేడాది నవంబరు 26న 2535 మెగావాట్లు ఉండగా.. ఈసారి 2973 మెగావాట్లకు పెరిగింది. నవంబరు 27న గతేడాది 2835 మెగావాట్లు నమోదు కాగా.. ఈసారి 3001 మెగావాట్లకు పెరిగింది. వినియోగంలోనూ పెరుగుదల నమోదైంది. 2023 నవంబరు 26న 49.57 మిలియన్ యూనిట్లు, నవంబరు 27న 53.56 మి.యూ. నమోదైంది. ఈ ఏడాదికి అవే రోజుల్లో 56.56, 56.06 మిలియన్ యూనిట్లు రికార్డైంది.

కారణాలేమై ఉంటాయ్... రాష్ట్రంలో గతేడాదితో పోలిస్తే విద్యుత్తు కనెక్షన్ల సంఖ్య పెరగడం, పరిశ్రమల పరంగా వాడకం, ఉదయం పూట ఇళ్లలో గీజర్ల వినియోగం అధికమవడం వంటి కారణాలతో విద్యుత్తు డిమాండ్ మునుపటి ఏడాది కంటే ఎక్కువగా ఉందని టీజీఎస్పీడీసీఎల్ అధికారులు అన్నారు.

# పక్కాగా నీటి లెక్క

హైదరాబాద్: గ్రేటర్ వ్యాప్తంగా భారీ ఎత్తున జరుగుతున్న నీటి పంపిణీ నష్టాలకు అడ్డుకట్ట వేసేందుకు జలమండలి ప్రణాళిక సిద్ధం చేస్తోంది. లీకేజీలతోపాటు నీటి బిల్లులు చెల్లించకపోవడంతో జలమండలి పెద్దఎత్తున రెవెన్యూ నష్టాలను మూటగట్టుకుంటోంది. బిల్లుల ఎగవేత నష్టాలకుతోడు 10–15 శాతం లీకేజీలు సైతం తోడవుతున్నాయి. వీటిని అరికట్టేందుకు జలమండలి తాగునీటి ఆడిట్ చేపట్టేందుకు సిద్ధమవుతోంది. త్వరలో అందుబాటులోకి రానున్న ఓఆర్ఆర్ ఫేజ్–2 ప్రాజెక్టులో భాగంగా ఈ ఆడిట్‌ను చేపట్టనున్నారు. తొలుత ప్యాకేజీ–2లోని ఉస్మాన్‌నగర్‌లో నిర్మిస్తున్న 4 మిలియన్ లీటర్లు, రెండు మిలియన్ లీటర్లు సామర్థ్యం ఉన్న జంట రిజర్వాయర్ల పరిధిలో అమలు చేయనున్నారు.

ఎలా చేస్తారంటే... ప్రస్తుతం అవుటర్ రింగ్‌రోడ్డు వరకు జలమండలి తాగునీటిని సరఫరా చేస్తోంది. దాదాపు 13 లక్షల నల్లాలకు రోజు విడిచి రోజు నీటిని అందిస్తోంది. దీనికోసం దాదాపు 9 వేల కిలోమీటర్ల తాగునీటి సరఫరా వ్యవస్థ ఉంది. నగరం చుట్టూ 225 వరకు సర్వీసు




రిజర్వాయర్లు అందుబాటులో ఉన్నాయి.

పాత పైపులైన్ల వ్యవస్థ, అక్రమ నల్లాలు ఇతరత్రా కారణాలతో చాలా ప్రాంతాల్లో లీకేజీలు అవుతున్నాయి. కొన్నిసార్లు చాలామంది బిల్లులు చెల్లించడం లేదు. వీటిని రెవెన్యూ నష్టాలుగా జలమండలి పరిగణిస్తోంది. ఇప్పటివరకు ఆడిట్ లేకపోవడంతో నీటి వృథా ఎంతవుతుందో లెక్క తేలడం లేదు. దీన్ని కనిపెట్టేందుకు ప్రతి రిజర్వాయర్‌తోపాటు వినియోదారులకు సరఫరా చేసే డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థలో చివరి పాయింట్ వద్ద ఫ్లో మీటర్లు ఏర్పాటు చేయనున్నారు.

రిజర్వాయర్ నుంచి ఎంత నీళ్లు బయటకు వస్తున్నాయి. ఇంటి వరకు ఎంత నీళ్లు సరఫరా అవుతున్నాయో ఇవి లెక్కకడతాయి. ఫలితంగా లీకేజీలను ఇట్టే గుర్తించే వెసులుబాటు కలగనుంది.

లీకేజీల రూపంలో ఎక్కువ నీళ్లు వృథా అవుతున్నట్లు గురిస్తే...ఆయా ప్రాంతాల్లో లీకేజీలు అరికట్టడం లేదంటే పాత పైపులు స్థానంలో కొత్త పైపులు ఏర్పాటు చేస్తారు.

## కూల్చిన ఇళ్ల వ్యర్థాల తరలింపు షురూ

హైదరాబాద్: నేలమట్టం చేసిన అక్రమ నిర్మాణాల వ్యర్థాలను తొలగించడంపై హైడ్రా దృష్టి పెట్టింది. చెరువులకు ఆక్రమణల నుంచి విముక్తి కల్పించి, వాటికి పునరుజ్జీవం కల్పించేందుకు నడుం బిగించింది. అందులో భాగంగా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ సోమవారం నిజాంపేటలోని ఎర్రకుంట చెరువులో వ్యర్థాల తరలింపు పనులను ప్రారంభించారు. ఈ చెరువులోని మూడు భవన సముదాయాలను ఆగస్టు 14న హైడ్రా నేలమట్టం చేసింది. కొన్ని రోజులకు శిథిలాల్లోని ఇనుము, ఇతరత్రా వస్తువులను నిర్మాణదారు తీసుకెళ్లారని హైడ్రా తెలిపింది. ఎందుకూ పనికిరాని ఇటుక, సిమెంటు



వ్యర్థాలను అక్కడే వదిలేశారని వెల్లడించింది. మొదటి దశలో నాలుగు చెరువులకు పునరుజ్జీవం కల్పించాలని హైడ్రా నిర్ణయించగా, వాటిలో ఎర్రకుంట ఒకటి. మరోవైపు స్థానికులు కూడా వ్యర్థాలను తొలగించాలని హైడ్రాను కోరారు. ఈ నేపథ్యంలో నిర్మాణదారుకు నోటీసులిచ్చి.. వ్యర్థాల తరలింపునకు శ్రీకారం చుట్టామని హైడ్రా అధికారులు తెలిపారు. అందుకయ్యే ఖర్చును అక్రమ నిర్మాణాల యజమాని నుంచి వసూలు చేస్తామన్నారు. ఇదే మాదిరి.. మిగిలిన చెరువుల్లోని నిర్మాణ వ్యర్థాలను, పూడికను తొలగించి.. జలవనరులకు జీవం పోస్తామన్నారు. వ్యర్థాల తరలింపు పనులను చేపట్టడంపై ప్రగతినగర్ వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

## పట్టణ భూములకు పక్కాగా లెక్కలు..!

కొత్తగూడెం: పట్టణ భూములకు పక్కాగా లెక్కలుండేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. ఇప్పటివరకు సాగు భూములకు ఉండే నక్షా మాదిరిగా.. పట్టణాలకు సైతం రూపొందించేలా చర్యలు చేపట్టాయి. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా 100 పట్టణాలకు నక్షా రూపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిధులు మంజూరు చేసింది. అందులో రాష్ట్రం నుంచి ఎనిమిది పట్టణాలుండగా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి మణుగూరు పురపాలికను పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది.

పురపాలిక పరిధిలో కొనసాగనున్న సర్వే

అన్నారం, చిన్నరావిగూడెం, అనంతారం, మణుగూరు రెవెన్యూ గ్రామాలను కలిపి మణుగూరు పురపాలికగా ఏర్పాటు చేశారు. దీని పరిధిలో అధికారులు సర్వే జరుపుతారు. సర్వే ఆఫ్ ఇండియా, పురపాలిక, భూమి కొలతలు– దస్త్రాల నిర్వహణ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా పైలెట్ ప్రాజెక్టును చేపట్టనున్నారు. నక్షా పథకంలో ప్రతి ఇల్లు, ఆస్తిని పక్కాగా సర్వే చేయనున్నారు. అక్షాంశాలు, రేఖాంశాలతో ఆస్తుల హద్దులు గుర్తించి వాటి విస్తీర్ణాలను డిజిటల్ పద్ధతిలో నిక్షిప్తపరుస్తారు. అనంతరం ఇల్లు లేదా ఆస్తికి 'ప్రాపర్టీ కార్డులు' అందజేస్తారు. వచ్చే డిసెంబరు నాటికి పైలెట్ సర్వే పూర్తిచేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

# వలపు వల.. ఉచ్చులో చిక్కి విలవిల



హైదరాబాద్: నగరంలో ఏటా సుమారు 400కు పైగా పోక్సో కేసులు నమోదవుతున్నాయి. 80 శాతం కేసుల్లో నిందితులు బాలికలను మాటలతో మభ్యపెట్టి లోబరచుకున్న వారే ఉంటున్నారు. ఈ ఏడాది 8 నెలల వ్యవధిలో 500కు పైగా పోక్సో కేసులు నమోదయ్యాయి. వీటిలో 279 మంది బాధితులు ప్రేమికులు, స్నేహితుల కోసం ఇల్లొదిలిన వారు కావటం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది. నగర పరిధిలోని 71 ఠాణాల్లో ఈ తరహా ఫిర్యాదులు సగటున రోజూ 1–2 వస్తుంటాయని సమాచారం.

ఓ ఇంటర్ విద్యార్థిని(16) ఆటోడ్రైవర్(35)తో ప్రేమలో పడింది. ఇల్లు విడిచి అతడితో వెళ్లిపోయింది. కొద్దిరోజులయ్యాక వ్యభిచార ముఠాకు విక్రయించేందుకు సిద్ధమయ్యాడు. ప్రమాదం పసిగట్టిన బాధితురాలు తప్పించుకొని బయటపడింది. అతడు అప్పటికే ముగ్గురు విద్యార్థినులను మోసగించినట్టు దర్యాప్తులో తేలింది.

ఉన్నత కుటుంబం. ఒక్కతే కూతురు(15). తల్లిదండ్రులు గారాబం చేశారు. పదో తరగతి వయసులో ముగ్గురి ప్రేమలో పడి మూడుసార్లు ఇల్లొదిలి వెళ్లిపోయింది. ప్రతిసారి ఇంటికి తీసుకొచ్చి పద్ధతి మార్చుకోమంటూ బతిమాలారు. కౌన్సెలింగ్‌లోనూ ఆ బాలికను దారికెలా తేవాలో అర్థం కావట్లేదని పోలీసు అధికారి తెలిపారు.

తెలిసీ తెలియని వయసు.. మంచిచెడు విచక్షణను అర్థం చేసుకోలేని మనసు. ఆప్యాయంగా పలకరించే వారంతా ఆత్మీయులుగా భావిస్తారు. వారి అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని యువకులు, మధ్యవయస్కులు బాలికలను వంచిస్తున్నారు. ప్రేమ, పెళ్లి అంటూ వంచిస్తున్నారు. వారు తీసుకొచ్చిన నగలు, డబ్బు కాజేసిన ప్రబుద్ధులు.. తర్వాత వ్యభిచార గృహాలకు విక్రయించేందుకు బరితెగిస్తున్నారని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు.

మోసపోతున్న బాలికల సగటు వయసు 12–15

మోసగాళ్ల సగటు వయసు 25–35

ఎందుకిలా వెళ్తున్నారంటే..

పరిణతిలేని వయసు

కుటుంబ సభ్యులకంటే బాగా చూసుకుంటాడనే నమ్మకం

తల్లిదండ్రుల పర్యవేక్షణలోపం

ప్రలోభాలకు గురికావటం

కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, మానసిక ఒత్తిళ్లు

తాను చిన్నపిల్లని కాదని సొంత నిర్ణయాలు తీసుకోగలననే అభిప్రాయం.

హార్మోన్ల ప్రభావం, లైంగిక అంశాలపై ఆసక్తి.

దాచకుండా.. పంచుకోవటమే మార్గం

డాక్టర్ గీత, చిన్నారుల కౌన్సెలింగ్ నిపుణురాలు

వయసులో హార్మోన్ల మార్పు, ఆకర్షణ వారిపై ఎలాంటి ప్రభావం చూపుతుందో తల్లిదండ్రులు వివరించాలి. ప్రేమవలలో చిక్కి మోసపోయిన బిడ్డలను శత్రువులుగా చూడకుండా... సాధారణ జీవనం వైపు అడుగులు వేసేలా తోడ్పాటును అందించాలి.

# చర్లపల్లి స్టేషన్.. వెళ్లాలంటే పరేషాన్



హైదరాబాద్ : అత్యాధునిక హంగులతో.. అంతర్జాతీయ ప్రమాణాలతో చర్లపల్లి రైల్వే స్టేషన్ సిద్ధమైంది. జాతికి అంకితం చేయడానికి ప్రధాని నరేంద్రమోదీ త్వరలో రానున్నారు. ఇవన్నీ బాగున్నా.. ఆ స్టేషన్‌కు చేరుకోవడమెలా అనేదే ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. స్టేషన్ నిర్మాణం ప్రారంభించిప్పటినుంచి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు రాస్తూ.. ఇరువైపులా రోడ్లను 100 మీటర్ల మేర విస్తరించాలని రైల్వే విజ్ఞప్తులు చేస్తూనే ఉంది. అవేవీ నాటి పాలకులకు పట్టలేదు. కొత్త ప్రభుత్వం కూడా ఇప్పటివరకు దృష్టి సారించకపోవడంతో.. స్టేషన్ ప్రారంభంనాటికి రహదారుల విస్తరణ జరిగేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎంఎంటీఎస్ రెండోదశ అందుబాటులోకి వచ్చినా ప్రయాణికులు ఈ స్టేషన్‌కు చేరుకునే వెసులుబాటు కలగలేదు. సరైన రహదారులు లేకపోవడంతో సిటీ బస్సుల సేవలు కూడా అందుబాటులోకి రాలేదు. ఇలాంటి తరుణంలో స్టేషన్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే.. ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందితప్పని పరిస్థితి ఏర్పడింది.

పెండింగ్‌లోనే ప్రక్రియ..

40 కిలోమీటర్ల పరిధి నుంచి ప్రయాణికులు చర్లపల్లి స్టేషన్‌కి చేరేందుకు రెండు మార్గాలున్నాయి. మహాలక్ష్మినగర్ నుంచి ఉన్న 40అడుగుల పాతరోడ్డును 80 అడుగుల మేర విస్తరించాల్సిఉంది. చర్లపల్లి టెర్మినల్ ముఖద్వారం నుంచి ఐవోసీఎల్‌ను కలుపుతూ 100 అడుగుల మేర మరోరోడ్డు విస్తరించాలని ప్రతిపాదించారు. జీహెచ్‌ఎంసీ అధికారులు సర్వేలు చేశారు. మహాలక్ష్మిరోడ్డు విస్తరణకు రూ. 15కోట్ల విలువైన ఆస్తులను తొలగించాలని గుర్తించారు. ఇచ్చేందుకు కాలనీవాసులు సుముఖంగా లేకపోవడంతో విస్తరణ పెండింగ్‌లో పడింది. ఇక 100 అడుగుల రోడ్డు విస్తరణలో 80శాతం భూములను అటవీశాఖ నుంచి, 20 శాతం చర్లపల్లి పారిశ్రామికవాడ నుంచి సేకరించాల్సి ఉంది. పెట్రోలియం, గ్యాస్ సంస్థలను తరలిస్తే..చర్లపల్లి స్టేషన్ చుట్టూ ఐవోసీ, హెచ్‌పీ, బీపీసీఎల్ సంస్థల గ్యాస్, పెట్రోలియం సంస్థల గోదాములు న్నాయి. వీటిని వేరే ప్రాంతాలకు తరలించాలనే ప్రతిపాదనలున్నాయి. ఐవోసీ, బీపీసీఎల్‌ను నార్కెట్‌పల్లికి తరలించే ప్రక్రియ దశలవారీగా కొనసాగుతోంది. మిగిలిన వాటిని తరలించే ప్రక్రియ పూర్తయితే దాదాపు 100 ఎకరాల స్థలం లభిస్తుంది. దీన్ని రైల్వేకు బదలాయిస్తే సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ కంటే సువిశాలమైన రైల్వే స్టేషన్ ఇక్కడ నిర్మించడానికి వెసులుబాటు ఉండేది. భూ సేకరణ జాప్యం కావడంతో రైల్వే వద్ద ఉన్న 50 ఎకరాల్లోనే చర్లపల్లి రైల్వే స్టేషన్ విస్తరణ పనులు జరిగాయి.

# తవ్వుతూ.. తరలిస్తూ



సిరిసిల్ల : కాళేశ్వరం ప్యాకేజీలు, అదనపు టీఎంసీ పనుల్లో బయటపడ్డ బండరాళ్లు అక్రమార్కులకు ఆదాయ వనరులుగా మారాయి. కాల్వలు, సొరంగాల తవ్వకాల్లో బయటపడ్డ రాళ్లను వాహనాల్లో క్రషర్‌లకు తరలిస్తున్నారు. కొన్నిచోట్ల అసంపూర్తి పనులు, మరికొన్ని చోట్ల గుత్తేదారు సంస్థలు క్యాంపులను వదిలివెళ్లడంతో నీటిపారుదలశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో అక్రమార్కులకు అడ్డు చెప్పేవారు లేకుండా పోయారు. ఫలితంగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. జిల్లాకు సాగునీరందించే కాళేశ్వరం 9, 10 ప్యాకేజీలతో పాటు అదనపు టీఎంసీ పనులు జరుగుతున్నాయి. కాళేశ్వరం ప్రధాన కాల్వలు, సొరంగాలు తవ్వకాల పనులన్నీ మూడేళ్ల క్రితమే పూర్తయ్యాయి. అదనపు టీఎంసీ పనులపై ప్రభుత్వంలో సందిగ్ధత నెలకొనడంతో ఆరు నెలల క్రితమే గుత్తేదారు సంస్థ పనులను మధ్యలో నిలిపేసి, క్యాంపులను ఖాళీ చేసి వెళ్లిపోయింది. సొరంగాలు, కాల్వలు, జలాశయాల తవ్వకాల్లో భారీగా రాళ్లు బయటపడ్డాయి. వీటిని చాలా వరకు జలాశయాల రివిట్‌మెంట్ కోసం గుత్తేదారులు కంకరగా మార్చారు. సీసీల నిర్మాణాలకు, సొరంగంలో గ్రౌటింగ్ పనులకు అందులో బయటపడ్డ రాళ్లనే వాడారు. మిగిలిన రాళ్లను కాల్వలు, సొరంగం సమీపంలోనే వదిలేశారు. కాల్వలు, జలాశయాల తవ్వకాల్లో విలువైన మట్టిని కూడా అక్రమార్కులు వదలడం లేదు. బోయినపల్లి, ఇల్లంతకుంట, తంగళ్లపల్లి, కోనరావుపేట మండలాల పరిధిలో ఎత్తిపోతల పథకం పంపుహౌస్‌ల సమీపం నుంచి భారీ ఎత్తున తరలించారు. ఇక్కడి నుంచి మట్టిని తవ్వి సమీపంలోని గ్రామాలకు తరలిస్తున్నారు. పట్టణంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు విక్రయించేందుకు స్థానికంగా ట్రాక్టర్ యజమానులు సిండికేట్‌గా మారారు.

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం సాగునీటి ప్రాజెక్టుల పనులేవీ జరగడం లేదు. నీటిపారుదల, రెవెన్యూ, గనుల శాఖల అధికారులు ఎవరూ ఇటువైపు రావడం లేదు. ఈ ప్యాకేజీల పరిధిలోని ఏఈల మొదలు ఈఈల వరకు అందరూ సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల కేంద్రాల్లోని డివిజన్ కార్యాలయాలకే పరిమితమయ్యారు. ప్రాజెక్టుల తవ్వకాల్లో బయటపడిన బండరాళ్లను గుట్టుచప్పుడు కాకుండా క్వారీలకు తరలిస్తున్నారు.

కాలువ తవ్వే సమయంలో కొన్ని చోట్ల రాతి పొరలు వచ్చాయి. వాటిని పగులగొట్టి కరకట్టల వెంట పటిష్ఠతకు కుప్పలుగా పోశారు. మిగిలిన వాటిని ఎక్కడికక్కడే వదిలేశారు. ఇప్పుడు వాటిపై క్రషర్ యజమానుల కన్ను పడింది. వీటిని అనువైన సమయంలో క్రషర్లకు తీసుకెళ్లి కంకరగా మార్చుతున్నారు. కంకర విక్రయాల్లో జిల్లాలోని క్రషర్ యజమానులంతా సిండికేట్‌గా మారి ధరలు నిర్ణయిస్తున్నారు. వీటిని అడ్డుకునేవారు లేకుండా పోయారు.

వేలం ద్వారా విక్రయించాలి

ప్రాజెక్టుల తవ్వకాల్లో బయటపడిన గ్రావెల్, బండలను గుత్తేదారులు ఆయా ప్రాజెక్టుల్లో అంతర్గత పనులకు వినియోగించుకోవచ్చు. మిగిలిన వాటికి సంబంధించి నీటిపారుదలశాఖ మాకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. అక్కడి నిల్వల ప్రకారం వేలం ద్వారా విక్రయించాల్సి ఉంటుంది. – క్రాంతికుమార్, సహాయ సంచాలకుడు, గనులశాఖ

# సమస్యలతోనే సేకరణ

జగిత్యాల : జిల్లాలో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు సమస్యలకు నిలయంగా మారాయి. 2006 సంవత్సరం నుంచి 35 సీజన్లుగా ధాన్యం, మక్కల సేకరణతో రైతులకు ప్రత్యామ్నాయ విపణులున్నా శాశ్వత సదుపాయాల కల్పనను విస్మరించారు. ప్రస్తుత యాసంగిలో జిల్లాలో వరికోతలు ప్రారంభమై ధాన్యం కల్లాలకు వస్తుండగా కర్షకులకు ఇక్కట్లు కలగకుండా చర్యలు చేపట్టాల్సిఉంది.

సమస్యలు ఇవీ..జిల్లాలో ఇందిరా క్రాంతిపథం మహిళా స్వశక్తి సంఘాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు సహకార సంఘాలు, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ధాన్యం సేకరణ చేపడుతున్నారు. కాగా తొలిసీజన్లలో ధాన్యంతో పాటుగా మక్కలను, మామిడి కాయలను కొనుగోలు చేయగా ప్రస్తుతం ధాన్యాన్ని మాత్రమే సేకరిస్తున్నారు. దీనికిగాను అన్ని వ్యవస్థల్లోనూ ధాన్యం సేకరణకు శాశ్వత సిబ్బందిని నియమించాల్సి ఉంది.

జిల్లాలో గడచిన యాసంగిలో ప్యాక్స్ ద్వారా 285, ఐకేపీ ద్వారా 133, మెప్మా ద్వారా 1 కేంద్రాన్ని ఏర్పాటుచేసి 4.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. 5 వేల క్వింటాళ్లకన్నా తక్కువ కొనుగోలు చేసిన, అధికంగా ఖర్చుచూపిన దాదాపు 34 ప్యాక్స్ కేంద్రాల స్థానంలో ఐకేపీ ద్వారా ధాన్యం సేకరించాలని నిర్ణయించారు. కొన్నిచోట్ల ధాన్యం సేకరణకు వచ్చిన కమీషన్‌ను పక్కదారి పట్టించారనే



ఆరోపణలుండగా ముస్ముందు ఇలా జరగకుండా చూడాలి.

మార్కెట్ యార్డుల్లోని కొన్ని సేకరణ కేంద్రాల్లోనే సిమెంటు గచ్చు అందుబాటులో ఉండగా గ్రామాల్లోని దాదాపు అన్ని కేంద్రాల్లోనూ మట్టికల్లాలు కావటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శాశ్వత స్థలాలున్న కేంద్రాల్లో సిమెంటు గచ్చును నిర్మించాల్సి ఉంది. గతంలో సరఫరా చేసిన టార్పాలిన్‌షీట్లు చిరిగిపోగా నూతనంగా సరఫరా చేయాలి. సేకరణ సంస్థలకు కమీషన్‌ను, రైతులకు క్వింటాలుకు రూ.5 చొప్పున హమాలీ ఛార్జీలను విడుదల చేయాలి.

తూకం, తేమ యంత్రాలు, గన్నీలు తదితర సామగ్రిని నిల్వచేసేందుకు గదులను ఏర్పాటు చేయాలి. సేకరణ సమయంలో కేంద్రాలవద్ద నీడ, మంచినీరు, విద్యుత్‌వంటి సదుపాయాలను పూర్తిస్థాయిలో కల్పించాలి. కేంద్రాల్లో ధాన్యం, తూకంవేసిన బస్తాల రక్షణకు రక్షకులను నియమించాలి.?ఈ సీజన్‌లో తొలిసారిగా సన్నగింజ రకాలను కొనుగోలు చేయనుండగా ధాన్యం ఎంపికలో తేడా రాకుండా చూడాలి. కేంద్రాల నుంచి మిల్లులకు పంపించిన ధాన్యాన్ని తరుగు, తేమ పేరిట కోతల్లేకుండా చూడాలి, లారీల్లోని బస్తాలను వెంటదివెంట దింపేలా చర్యలు తీసుకోవాలి. కేంద్రాల్లో తగిన సంఖ్యలో హమాలీలను నియమించాలి, ప్రభుత్వ నిర్దేశిత ధర ప్రకారమే హమాలీ ఛార్జీలను రైతుల నుంచి తీసుకునేలా చూడాలి. రైతులనుంచి అదనపు వసూళ్లను అరికట్టాలి. డీసీఎంఎస్ కేంద్రాల్లో సంస్థ ఉద్యోగులను నియమించాలి, ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను వెంటదివెంట ఆన్‌లైన్ చేయాలి. పంటను సాగుచేసిన రైతుల వివరాలు పోర్టల్‌లో లేకున్నా ఏఈవో ధ్రువీకరణతో ధాన్యాన్ని కొనుగోలు చేయాలి. చిరిగిన గన్నీలు కాకుండా మంచి సంచులను, తగినన్ని సరఫరా చేయాలి.

అన్ని కేంద్రాల్లోనూ రైతులు ధాన్యాన్ని ఆరబెడుతున్నందున వరుసక్రమాన్ని పాటించాలి. లారీల గుత్తేదారు తూకంవేసిన బస్తాలను వెంటదివెంట తరలించేలా చూడాలి లేదా బస్తాల తరలింపు బాధ్యతలను మిల్లర్లకే అప్పగించి వారికే రవాణా ఛార్జీలను చెల్లించటం సత్ఫలితాలనిస్తుంది.

జిల్లాలో వరిసాగు: 3.16 లక్షల ఎకరాలు

ఏర్పాటు చేయనున్న సేకరణ కేంద్రాలు: 421

సన్నరకాల సాగు: 86 వేల ఎకరాలు

సగటు దిగుబడి అంచనా: 6.50 లక్షల మెట్రిక్ టన్నులు

సన్నరకాల సేకరణ కేంద్రాలు: 65

మొత్తం కొనుగోలు అంచనా: 5 లక్షల మెట్రిక్ టన్నులు

## రహదారి నిర్మాణానికి మోక్షమెప్పుడో..?

కొడిమ్యాల : కొడిమ్యాల మండల కేంద్రంలోని అంగడిబజార్ ప్రాంతం నుంచి బస్టాండు సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వరకు గల ప్రధాన రహదారి గుంతల మయంగా మారడంతో గ్రామప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సుమారు 1200 మీటర్ల రహదారి పూర్తిగా గుంతలు పడటంతో వాహనాల రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై దుమ్ము, ధూళితో దుకాణాదారులు, రోడ్డు పక్కనే ఇళ్లు ఉన్నవారు అనారోగ్యాలకు గురవుతున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించిన నూతన రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి సమస్యలు పరిష్కరించాలని ప్రయాణికులు, గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రతిపాదనలకే పరిమితం..అంగడిబజార్ నుంచి బస్టాండు వరకు ప్రధాన రహదారి నిర్మాణానికి గతంలో పలువురు ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చినప్పటికీ నెరవేర్చడంలో విఫలమయ్యారు. నాలుగేళ్ల కిందట ఆర్అండ్‌బీ అధికారులు తారురోడ్డు నిర్మాణానికి సర్వే చేపట్టి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు. ప్రస్తుత ప్రభుత్వం స్పందించి రహదారి నిర్మాణానికి మంజూరు చేయాలని గ్రామస్థులు, ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్డంతా గుంతలే...రోడ్డంతా గుంతలమయంగా మారడంతో బస్టాండు నుంచి అంగడిబజార్ వెళ్లాలంటే గర్భిణులు, అనారోగ్యంతో ఉన్నవారు, వృద్ధులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో గుంతల కారణంగా పలువురు వాహనదారులు అదుపుతప్పి పడిపోవడంతో ఆసుపత్రి పాలయ్యారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో పాటు వాహనాలు సైతం దెబ్బతింటున్నాయి. ప్రజాప్రతినిధులు స్పందించి నూతన రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలి.

దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నాం..

ప్రధాన రహదారిపై రాకపోకలు ఎక్కువగా ఉండటంతో దుమ్ము, ధూళి చెలరేగి దుకాణాల్లోని సామగ్రిపై పేరుకుపోతోంది. అంతేగాక రోడ్డు వెంట వస్త్ర దుకాణాలు, లేడిస్ ఎంపోరియం వంటివి ఎక్కువగా ఉండటంతో దుమ్ము చేరి పాడవుతున్నాయి. నిత్యం దుమ్మును దులుపుకోలేక ఇబ్బందులు పడుతున్నాము. శ్వాస సంబంధ వ్యాధులు ఉన్నవారు సమస్యలు ఎదుర్కొంటున్నారు.



## జగన్ అక్రమాస్తుల కేసులు.. రెండు వారాల్లో పూర్తి వివరాలివ్వండి

దిల్లీ: జగన్ అక్రమాస్తుల కేసుల పూర్తి వివరాలు అందించాలని సీబీఐ, ఈడీలను సుప్రీంకోర్టు ఆదేశించింది. కేసుల పూర్తి వివరాలు 2 వారాల్లోగా అందించాలని పేర్కొంది. కింది కోర్టులో ఉన్న డిశ్చార్జ్ పిటిషన్ల వివరాలు ఇవ్వాలని ధర్మాసనం చెప్పింది. తెలంగాణ హైకోర్టులో ఉన్న పెండింగ్ అప్లికేషన్ల వివరాలు అందించాలని సూచించింది. సీబీఐ, ఈడీ కేసుల వివరాలు విడివిడిగా చార్ట్ రూపంలో అందించాలంది. అన్ని వివరాలతో అఫిడవిట్లు రెండు వారాల్లో దాఖలు చేయాలని ఆదేశించింది. జగన్ అక్రమాస్తుల కేసు విచారణ ఆలస్యమవుతోందని ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు గతంలో పిటిషన్ వేశారు. కేసు విచారణ మరో రాష్ట్రానికి బదిలీ చేయాలన్నారు. దీనిపై విచారణను జస్టిస్ అభయ్ ఎస్ ఓకా ధర్మాసనం చేపట్టింది. వాదనల సందర్భంగా.. రోజువారీ పద్ధతిలో విచారణకు ఇప్పటికే తెలంగాణ హైకోర్టు ఆదేశించినట్లు ఇరుపక్షాల న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విచారణ ఇన్నేళ్లపాటు ఎందుకు ఆలస్యమవుతోందని ధర్మాసనం ప్రశ్నించింది. డిశ్చార్జ్, వాయిదా పిటిషన్లు, ఉన్నత కోర్టుల్లో విచారణ పెండింగే కారణమని న్యాయవాదులు చెప్పారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలిస్తే తగిన ఆదేశాలు ఇస్తామని ధర్మానం చెప్పింది. తెలంగాణ హైకోర్టు ఆదేశాలు, ట్రయల్ కోర్టు, పెండింగ్ కేసుల వివరాలు ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 13కు వాయిదా వేసింది.



## సీఎం చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భేటీ

అమరావతి: ఏపీ సీఎం చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ భేటీ అయ్యారు. ఉండవల్లిలోని సీఎం నివాసంలో వీరిద్దరి సమావేశం జరిగింది. కాకినాడలోని బియ్యం అక్రమ రవాణాపై వారు చర్చించినట్లు తెలుస్తోంది. తాజా రాజకీయ పరిణామాలు, రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపైనా సమాలోచనలు చేశారు. మరోవైపు తన దిల్లీ పర్యటన విశేషాలను చంద్రబాబుకు పవన్ వివరించినట్లు సమాచారం. సోషల్ మీడియా కేసులు, నామినేటెడ్ పదవుల అంశం వీరి మధ్య చర్చకు వచ్చినట్లు తెలియవచ్చింది.

## బియ్యం దొంగలెవరు?.. ఇదో జాతీయస్థాయి కుంభకోణం: షర్మిల




విజయవాడ: రేషన్ బియ్యం అక్రమంగా విదేశాలకు తరలింపు వెనుక పెద్ద మాఫియా ఉందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. ఇదో జాతీయస్థాయి కుంభకోణమన్నారు. ఈ మేరకు ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. "పేదల పొట్టకొట్టి రూ.48 వేల కోట్ల ప్రజల డబ్బును పందికొక్కుల్లా తిని దోపిడీకి పాల్పడ్డారు. తిలా పాపం.. తలా పిడికెడు అన్నట్లు.. రేషన్ బియ్యం స్మగ్లింగ్ వెనుక ప్రజా ప్రతినిధుల ప్రమేయముంది. ఈ వ్యవహారంలో కింది నుంచి ఉన్నత స్థాయి వరకు కొంతమంది అవినీతి అధికారుల పాత్ర ఉంది. ఎవరికి దక్కాల్సిన వాటా వాళ్లకు చేరుతుండటంతో నిఘా వ్యవస్థ పూర్తిగా కళ్లు మూసుకుంది. గడిచిన మూడేళ్లలో రాష్ట్రంలోని పోర్టుల నుంచి 2 కోట్ల టన్నుల రేషన్ బియ్యం అక్రమంగా రవాణా జరిగిందంటే.. మన చెక్ పోస్టుల పని తీరు ఎలా ఉందో అంచనా వేయొచ్చు.. ఏ స్థాయిలో అవినీతి జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. పేదలకు దక్కాల్సిన బియ్యాన్ని అక్రమంగా పోర్టు దాకా ఎలా చేర్చారు?మూడేళ్లలో 2 కోట్ల టన్నుల రేషన్ బియ్యాన్ని ఎలా సేకరించారు? దీని వెనకున్న దొంగలెవరు? రూ.48 వేల కోట్లు ఎవరెవరు తిన్నారు ? అప్పటి ప్రభుత్వ పెద్దలకు బియ్యం మాఫియాతో సంబంధాలు ఉన్నాయా ?తీగ లాగితే వెనకున్న డొంక ఎక్కడ ? మిల్లర్ల చేతివాటం ఉందా? రేషన్ డీలర్ల మాయాజాలమా?అనునిత్యం తనిఖీల సంగతేంటి? పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు కమిటీ వేయాలి. అవసరమైతే కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐతో విచారణ జరిపించాలి. ప్రపంచానికి అన్నం పెట్టే మన రాష్ట్రాన్ని రేషన్ బియ్యం మాఫియాకు అడ్డాగా మార్చారు. ఈ వ్యవహారంలో నిజాలు నిగ్గు తేల్చాలి"అని షర్మిల డిమాండ్ చేశారు.

## ట్రాఫిక్ నియంత్రణకు అంబాసిడర్లు: విజయవాడ సీపీ




విజయవాడ: ట్రాఫిక్ సమస్యల్ని పరిష్కరించేందుకు ట్రాఫిక్ అంబాసిడర్లను ఏర్పాటు చేయనున్నట్లు విజయవాడ నగర పోలీస్ కమిషనర్ సి.రాజశేఖర్ బాబు తెలిపారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పటిష్ఠపరచడంతోపాటు ట్రాఫిక్‌లో విప్లవాత్మక మార్పులను చేయబోతున్నామన్నారు. ఎక్కడైనా ట్రాఫిక్ జామ్ కాగానే వెంటనే వాట్సప్ గ్రూపులో ఫొటోలు అప్‌లోడ్ చేయాలన్నారు. "అక్టోబర్ నుంచి నవంబర్‌కు ట్రాఫిక్ అంతరాయాలను తగ్గించగలిగాం. అస్త్రం యాప్‌లో రియల్ టైం డేటా సేకరించి ప్రజలకు సేవలందిస్తున్నాం. ట్రాఫిక్ రద్దీ తగ్గాలంటే టెక్నాలజీ వినియోగించాలి. ట్రాఫిక్ అంతరాయం ఎక్కడ ఉంటుందో డ్రోన్ అక్కడ ఉంటుంది. ట్రాఫిక్‌ను పసిగట్టి వెంటనే సమాచారం చేరవేస్తుంది. అనేక సందర్భాల్లో ఫిజికల్ పోలీసింగ్ అందుబాటులో ఉండకపోవచ్చు. అన్‌ప్లాన్డ్ ఇన్సిడెంట్స్‌ని గుర్తించడమే ఈ యాప్ పని. పోలీసులు ఈ యాప్‌ని ఉపయోగించి త్వరగా స్పందిస్తున్నారు" అన్నారు. "కంట్రోల్ రూమ్ నుంచే జంక్షన్ కానిస్టేబుల్‌కు సూచనలందిస్తున్నాం. రెడ్ ఎఫ్‌ఎం ద్వారా ట్రాఫిక్‌పై మెసేజ్‌లను ఇస్తున్నాం. త్వరలోనే ఐదు జంక్షన్లలో ఎల్‌ఈడీ బోర్డులను ఏర్పాటు చేయబోతున్నాం. కొన్ని డ్రోన్లను వెస్ట్ బైపాస్‌కి, రామవరప్పాడు రింగు రోడ్ వరకు ఏర్పాటు చేస్తాం. రేపు మధ్యాహ్నం ట్రాఫిక్ ఎలా ఉండబోతుందనేది అస్త్రం అనే ఏఐ టూల్ ద్వారా తెలుసుకుంటాం. డిసెంబర్‌లో ఇంకొంచెం మెరుగుపడేలా మార్పులు చేశాం. డీసీపీ గౌతమి బెంగళూరులోని ట్రాఫిక్ నిబంధనల గురించి చెప్పినప్పుడు ఇక్కడ కూడా కఠినంగా అమలు చేయాలని ఆలోచించాం. ఓ ఫీడ్‌బ్యాక్ మెకానిజంలా అస్త్రం యాప్ ఉపయోగపడుతుంది" అని సీపీ వివరించారు.

## స్థానికులకు శ్రీవారి దర్శనం.. టోకెన్ల జారీని ప్రారంభించిన తితిదే ఛైర్మన్

తిరుమల: స్థానికులకు తిరుమల శ్రీవారి దర్శన టోకెన్ల జారీ ప్రక్రియ ప్రారంభమైంది. తిరుపతిలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు దీన్ని ప్రారంభించారు. నగరంలోని మహతి ఆడిటోరియంలో ఈవో శ్యామలరావుతో కలిసి స్థానికులకు టోకెన్లను అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ నాయుడు మాట్లాడుతూ.. నవంబర్ 18న జరిగిన తితిదే బోర్డు తొలి సమావేశంలో ప్రతి నెల మొదటి మంగళవారం స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తితిదే ఈవో శ్యామలరావు మాట్లాడుతూ.. స్థానికుల కోసం తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో 7 కౌంటర్లు, తిరుమల బాలాజీ నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో 3 కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం తిరుపతిలో 2,500, తిరుమలలో 500 టోకెన్లు జారీ చేస్తామన్నారు. ఒరిజినల్ ఆధార్ కార్డుతో తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట, తిరుమల నివాసితులకు టోకెన్లు జారీ చేయనున్నట్లు చెప్పారు. ప్రతి నెల మొదటి ఆదివారం రెండు కేంద్రాల్లోనూ దర్శన టోకెన్లు జారీ చేయనున్నట్లు తెలియజేశారు. స్థానిక భక్తులు ఒకసారి శ్రీవారిని దర్శనం చేసుకున్న 90 రోజుల తర్వాత మాత్రమే తదుపరి దర్శనానికి అర్హులు. భక్తులు సులువుగా టోకెన్లు పొందేందుకు వీలుగా క్యూలైన్లు, టోకెన్ల జారీకి అన్ని ఏర్పాట్లను తితిదే పూర్తి చేసింది. కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తదితరులు పాల్గొన్నారు.




## హసీనా పాలనలో ఏటా రూ.లక్షల కోట్లు దేశం దాటాయి..

### హసీనా పాలనలో ఏటా రూ.1.3 లక్షల కోట్లు దేశం దాటాయి..: యూనిస్ సర్కారు ఆరోపణలు

బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ పాలనలో ఏటా 16 బిలియన్ డాలర్లు (రూ.1.3 లక్షల కోట్లు) మేరకు మనీలాండరింగ్ చోటుచేసుకొందని మహమ్మద్ యూనిస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ఆరోపించింది. 2009 నుంచి 2023 వరకు గత ప్రభుత్వ పాలనపై శ్వేతపత్రం విడుదల చేసింది. డాక్టర్ దేబప్రియా భట్టాచార్య నేతృత్వంలోని కమిటీ అవినీతి, నిధుల దుర్వినియోగంపై దీనిని తయారుచేసింది. మొత్తం 24 అధ్యాయాలు ఉన్న ఈ నివేదికను సోమవారం ప్రచురించారు. హసీనా పాలనలో మొత్తంగా 234 బిలియన్ డాలర్ల (రూ.19 లక్షల కోట్లకుపైగా) సొమ్ము దేశాన్ని దాటిందని డెయిలీ స్టార్ కథనంలో పేర్కొంది. ఇక ఈ సొమ్ము యూఏఈ, యూకే, కెనడా, అమెరికా, హాంకాంగ్, సింగపూర్, మలేసియా, భారత్ సహా కొన్ని పన్నురహిత దేశాలకు తరలినట్లు ఆ శ్వేత పత్రంలో పేర్కొన్నారు. ఈ వైట్‌పేపర్‌ను చారిత్రక పత్రమని ఆ దేశ ప్రభుత్వ పెద్ద, ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనిస్ అభివర్ణించారు. అంతేకాదు.. తిరుగుబాటు తర్వాత తమ చేతికి వచ్చిన దేశ ఆర్థికవ్యవస్థ పరిస్థితిని ఇది ప్రతిబింబిస్తోందన్నారు.

**హసీనా ర్యాలీపై గ్రనేడ్లు విసిరినవారి మరణశిక్షలు రద్దు...** హసీనా ప్రభుత్వ హయాంలో ఏటా 24 బిలియన్ డాలర్ల (రూ.2 లక్షల కోట్లకు పైగా) నుంచి 60 బిలియన్ డాలర్ల (రూ.5 లక్షల కోట్లకు పైగా)ను వార్షిక అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించేవారు. దీనిలో అత్యధిక మొత్తం సొమ్ము రాజకీయ నాయకుల జేబుల్లోకి, లంచాల రూపంలో, బడ్జెట్ పెంపులకే పోయినట్లు ఆ వైట్ పేపర్‌లో పేర్కొన్నారు. దేశంలోని 532 మందికి దుబాయ్‌లో 375 మిలియన్ డాలర్ల విలువైన స్థిరాస్తులున్నాయని పేర్కొంది. ఇక 972 మందికి అక్కడ నివాస గృహాలున్నట్లు వెల్లడించింది. ఒక్క కెనడాకే అత్యధికంగా 100 బిలియన్ డాలర్లు (రూ.8 లక్షల కోట్లకుపైగా) తరలివెళ్లినట్లు ఈ నివేదికలో పేర్కొన్నారు. ఈ శ్వేతపత్రం కమిటీని ఆగస్టు 28న ఏర్పాటుచేశారు. హసీనా సర్కారు సమయంలో బంగ్లాదేశ్ ఆర్థికవ్యవస్థ సంపూర్ణ చిత్రాన్ని ఆవిష్కరించడమే దీని లక్ష్యం.

దేశంలోని విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగిన రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమం కారణంగా ఆగస్టు 5వ తేదీన షేక్ హసీనా దేశం విడిచి భారత్‌కు వచ్చేశారు. ఆ తర్వాత సైన్యం మద్దతుతో మహమ్మద్ యూనిస్ ప్రధాన సలహాదారుగా తాత్కాలిక ప్రభుత్వం అధికారం చేపట్టింది. ఆ తర్వాత అక్కడ మైనార్టీలపై దాడులు పెరిగాయి.



## ఆ నిర్ణయం న్యాయ విరుద్ధం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తన కుమారుడు హంటర్ బైడెన్‌కు క్షమాభిక్ష పెట్టడాన్ని అగ్రరాజ్యానికి కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తప్పుబట్టారు. ఇది పూర్తిగా న్యాయవిరుద్ధమని, అధికార దుర్వినియోగమని మండిపడ్డారు. అక్రమంగా ఆయుధం కొనుగోలు, ఆదాయపు పన్ను విషయంలో తప్పుడు సమాచారం ఇచ్చారని డెలావెర్, కాలిఫోర్నియాలో తన కుమారుడు హంటర్‌పై కేసులు నమోదైన నేపథ్యంలో తనకున్న అధికారంతో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అతడికి వాటినుంచి ఉపశమనం కల్పించారు. హంటర్‌కు క్షమాభిక్ష ప్రసాదించారు. తన కుమారుడిపై కేసులు రాజకీయ ప్రేరేపితమైనవేనని బైడెన్ ఆరోపించారు. ఒక తండ్రిగా, అధ్యక్షుడిగా ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నానో అమెరికా ప్రజలు అర్థం చేసుకుంటారని భావిస్తున్నానని పేర్కొన్నారు. కాగా.. హంటర్ దోషిగా తేలిన సమయంలో క్షమాభిక్షకు యత్నించబోనని స్పష్టంగా పేర్కొన్న బైడెన్.. తాజాగా ఈ నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశమైంది. దీనిపై డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ బైడెన్ నిర్ణయం 'న్యాయ విఘాతం' అని అన్నారు. 'హంటర్‌కు క్షమాభిక్ష ప్రసాదించినట్లే ఏళ్లుగా జైళ్లలో మగ్గుతున్న జే-6 (జనవరి 6న క్యాపిటల్ హిల్‌లో ట్రంప్ తరఫున అల్లర్లలో పాల్గొన్నవారు) బందీలకు ఎందుకు ఉపశమనం కల్పించలేదని ప్రశ్నించారు. తన కుమారుడిని కేసుల నుంచి తప్పించడం పూర్తిగా న్యాయవిరుద్ధం, అధికార దుర్వినియోగం అని సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టారు.

**ఏమిటీ క్యాపిటల్ భవనం అల్లర్లు ? :** 2021 జనవరి 26న అమెరికా అధ్యక్షుడిగా జో బైడెన్(%జీశీవ దీఅఎవఅ%) విజయాన్ని ధ్రువీకరించేందుకు వాషింగ్టన్ క్యాపిటల్ భవనంలో కాంగ్రెస్ సమావేశమైన సమయంలో ట్రంప్ మద్దతుదారులు వేలాదిగా క్యాపిటల్ భవనంలోకి చొచ్చుకెళ్లి విధ్వంసం సృష్టించారు. వారి దాడిలో 140 మందికి పైగా పోలీసు అధికారులు గాయపడ్డారు. దాడుల్లో పాల్గొన్న 1,500 మందిపై పలు కేసులు నమోదయ్యాయి. ఈ దాడులకు నాయకత్వం వహించిన తీవ్రవాద ప్రౌడ్ బాయ్స్ నాయకుడు ఎన్రిక్ టారియోకు 22 ఏళ్లుగా జైలు శిక్ష అనుభవిస్తుండగా, ఓత్ కీపర్స్ మిలిటెంట్ గ్రూపు నాయకుడు స్టీవర్ట్ రోడ్స్ 18 ఏళ్లుగా కారాగార శిక్ష అనుభవిస్తున్నారు. కాగా అమెరికా ఎన్నికల్లో ట్రంప్ గెలుపొందడంతో వారిపై ఉన్న కేసులను మాఫీ చేస్తారని ఆయన మద్దతుదారులు ఎదురుచూస్తున్నారు.

## పవన్‌ని చూస్తే.. గబ్బర్ సింగ్ 3 గుర్తుకు వస్తుంది



విశాఖపట్నం: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై మాజీ మంత్రి, వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్ కల్యాణ్ తీరు చూస్తే.. గబ్బర్ సింగ్ 3 గుర్తుకు వస్తుందని వ్యంగ్యంగా అన్నారు. గతంలో ఆయన గబ్బర్ సింగ్ 1, 2 చిత్రాల్లో నటించిన విషయాన్ని ఈ సందర్భంగా బొత్స గుర్తు చేశారు. సోమవారం విశాఖపట్నంలో ఎమ్మెల్సీ బొత్స మాట్లాడుతూ.. కాకినాడ పోర్ట్ నుంచి బియ్యం స్మగ్లింగ్ అని డిప్యూటీ సీఎం పవన్ అంటున్నారని.. బాధ్యులపై చర్యలు తీసుకోవద్దని ఎవరన్నారని ప్రశ్నించారు.

**మంత్రి ప్రమేయం లేకుండానే..?** మంత్రి ప్రమేయం లేకుండా ఈ కార్యక్రమాలు జరుగుతాయా? అని పవన్ కల్యాణ్‌ను బొత్స నిలదీశారు. పోర్టు.. రెడ్డి గారికి ఉంటే ఏమిటి? చౌదరి గారికి ఉంటే మాకు ఏం సంబంధమన్నారు. అయితే పవన్ కళ్యాణ్ చిత్తశుద్ధిని తాను శంకించడం లేదని స్పష్టం చేశారు.


**అప్పట్లో భ్రమ పడ్డా..** 2004లో తాను మంత్రి అయినప్పుడు తనకు ఎన్నో అధికారాలున్నాయని భ్రమ పడ్డానని తెలిపారు. మొదట్లో మంత్రి పదవి వచ్చినప్పుడు హా.. ఆ.. అంటామని పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి పరోక్షంగా బొత్స విమర్శించారు. కానీ వారు.. వీరు కూర్చొని మాట్లాడుకొని... కష్టసుఖాలు తెలుసుకున్న అనంతరం అన్ని మర్చిపోతారని చెప్పారు.

**పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలపై బొత్స ఫైర్...** ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల.. ఒక రాజకీయ పార్టీ నాయకురాలు లాగా మాట్లాడడం లేదన్నా రు. ఆమెను మీరు గుర్తిస్తున్నారేమో కానీ.. తాము గుర్తించడం లేదని స్పష్టం చేశారు. తాను సైతం గతంలో పీసీసీ అధ్యక్షుడిగా పని చేశానని ఈ సందర్భంగా బొత్స గుర్తు చేసుకున్నారు. పీసీసీ చీఫ్‌గా పలు అం శాలపై మాట్లాడాలి కానీ.. వ్యక్తిగతంగా మాట్లాడకూడదంటూ వైఎస్ షర్మిల వ్యవహార శైలిని ఆయన నిశితంగా విమర్శించారు. పంచాయ తీల కోసం రాజకీయాలు లేవనే విషయాన్ని వైఎస్ షర్మిల గ్రహించాలన్నారు.

**బెల్ట్ షాపులు.. విద్యుత్ ఛార్జీలు..** కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు బడ్జెట్‌లో.. కనబడడం లేదన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి.. అధికారంలోకి వచ్చిన అనంతరం ట్రూప్ ఛార్జీల పేరుతో పెంచడానికి రెడీ అవుతున్నారని విమర్శించారు. ఈ ట్రూప్ ఛార్జీల భారాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బెల్ట్ షాపులు పెరిగిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తమ ఊళ్లో బెల్ట్ షాపునకు ఆక్షన్ వేశారంటే పరిస్థితి అర్థం చేసుకోచ్చునని ..ఈ విషయం అన్ని ప్రముఖ దిన పత్రికలో వచ్చిందని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ వివరించారు.

**సూపర్ సిక్స్ అమలు ఎక్కడ..?..** ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఎక్కడ అమలవుతున్నాయని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెచ్చిన అప్పులు ఏమి అవుతున్నాయని ఆయన సందేహం వ్యక్తం చేశారు. విశాఖపట్నంకు టీసీఎస్ కంపెనీ రావడం మంచిదే.. మరి మిగిలిన కంపెనీలు ఎప్పుడు వస్తాయి, ఎన్ని ఉద్యోగులొస్తాయి అనే విషయాన్ని సైతం ప్రకటించాలని కూటమి ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ నిలదీశారు.

## సజ్జల భార్గవరెడ్డికి సుప్రీంలో చుక్కెదురు



దిల్లీ: వైకాపా సోషల్ మీడియా పూర్వ కన్వీనర్ సజ్జల భార్గవరెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఆయన పిటిషన్‌ను స్వీకరించేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. విజ్ఞప్తులు ఏమైనా ఉంటే హైకోర్టు ముందే చెప్పుకోవాలని స్పష్టం చేసింది. సోషల్ మీడియాలో అసభ్య పోస్టులపై నమోదైన కేసుల్లో తనపై ఉన్న ఎఫ్ఐఆర్‌లను కొట్టివేయాలని ఇటీవల భార్గవరెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించేందుకు జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం నిరాకరించింది. సజ్జల భార్గవరెడ్డి తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, ఏపీ ప్రభుత్వం తరపున మరో సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. పాత విషయాలకు కొత్త చట్టాల ప్రకారం కేసులు పెడుతున్నారని కపిల్ సిబల్ చెప్పగా.. చట్టాలు ఎప్పటివనేది కాదని.. మహిళలపై చేసిన అసభ్య వ్యాఖ్యలు చూడాలని లూథ్రా వాదించారు.

ఈ వ్యవహారంలో భార్గవరెడ్డి కీలక సూత్రధారి అని.. ప్రస్తుత దర్యాప్తునకు కూడా సహకరించడం లేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సుప్రీంకోర్టు ముందు చాలా విషయాలు గోప్యంగా ఉంచారన్నారు. దుర్భాషలు ఉపయోగించే ఎవరైనా చట్టపర పరిణామాలను ఎదుర్కోవాల్సిందేనని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఏపీ హైకోర్టును ఆశ్రయించేందుకు ధర్మాసనం రెండు వారాల సమయమిచ్చింది.

# తెల్లని చీరలో అంజలి.. చూసేందుకు రెండు కళ్లు సరిపోవేమో

టాలెంటెడ్ నటిగా అంజలి తనకంటూ ఒక ప్రత్యేకమైన క్రేజ్ అందుకుంటోంది. మొదట్లోనే నటనతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుని, ఇప్పుడు సోషల్ మీడియాలో కూడా తన అందంతో అలరిస్తుంది. లేటెస్ట్ గా అంజలి ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని అందమైన ఫోటోలను పంచుకుంటూ, ఆమె సౌందర్యాన్ని మరో లెవెల్ కు తీసుకెళ్లింది. ఈ ఫోటోల్లో ఆమె తెలుపు చీరలో మెరిసిపోతూ, సంప్రదాయానికి గ్లామర్ టచ్ ఇస్తూ కనిపిస్తుంది. తెలుపు చీరకు జతగా ఎరుపు బ్లౌజ్ ధరించిన ఆమెకు చిరునవ్వు మరింత ఆకర్షణను చేకూరుస్తుంది. మెరిసే ఈ లుక్‌తో అంజలి ఫ్యాషన్ ప్రపంచంలో తన ప్రత్యేక స్థానాన్ని చూపిస్తుంది. ఆమె జుట్టును అర్ధచంద్రాకారంలో అలంకరించుకుని, సన్నని ఆభరణాలతో చీర అందాన్ని మరింత



ఎలివేట్ చేసింది. ఫోటోలలో కనిపించే ఆమె లుక్ ప్రతి ఒక్కరిని ఆకట్టుకునేలా ఉంది. ఇక ఆమె అందాన్ని చూసేందుకు రెండు కళు సరిపోవేమో అని కొందరు నెటిజన్లు పాజిటివ్ గా స్పందిస్తున్నారు. అంజలి కెరీర్ విషయానికి వస్తే, ఆమె తమిళ మరియు తెలుగు చిత్రాలలో తనదైన శైలిలో నటించి మెప్పించింది. ఇటీవల విడుదలైన 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' మూవీలో ఆమె నటన విమర్శకుల ప్రశంసలు పొందింది. రామ్ చరణ్ నటిస్తున్న 'గేమ్ ఛేంజర్'లో అంజలి కీలక పాత్ర పోషిస్తోంది, ఈ చిత్రం ఆమె కెరీర్‌కు మరో కీలక మలుపు కావచ్చు. అంజలి, తన ప్రాజెక్ట్‌లతో పాటు, తన సోషల్ మీడియా యాక్టివిటీ ద్వారా కూడా అభిమానులతో ఎప్పుడూ టచ్‌లో ఉంటుంది. ఈ తాజా ఫోటోషూట్‌తో ఆమె తన గ్లామర్, అందాన్ని మరోసారి హైలెట్ చేసింది. ఇక అంజలి ఇటీవల చేసిన సినిమాలు నటిగా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చిపెట్టాయి. ఆమె సోషల్ మీడియాలో ఇలాంటి ఫోటోలు షేర్ చేయడం ద్వారా, అభిమానుల హృదయాలను గెలుచుకునేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటోంది. ఇక ప్రస్తుతం మరికొన్ని ప్రాజెక్ట్ లు కూడా చర్చల దశలో ఉన్నాయి. త్వరలోనే వాటిపై అఫీషియల్ క్లారిటీ రానుంది.

# ఫోటో క్రెడిట్ లేదా పుష్పా అంటూ వచ్చేశాడు..!

హనుమాన్ తో పాన్ ఇండియా హిట్ అందుకున్న డైరెక్టర్ ప్రశాంత్ వర్మ హీరో తేజా సజ్జా ఇద్దరు ప్రొఫెషనల్ గానే కాదు పర్స నల్ గా కూడా మంచి ఫ్రెండ్స్. అందుకే వాళ్లిద్దరు కలిసి చేసిన ప్రాజెక్టులు రెండు ఒకటి జాంబి రెడ్డి రెండోది హనుమాన్ హిట్ అయ్యాయి. ఐతే ఆన్ స్క్రీన్ మీద వారి టాలెంట్ తో మెప్పించే వీరు ఆఫ్ స్క్రీన్ పై ఒకరి మీద ఒకరు వేసుకునే పంచులు కూడా ప్రేక్షకులను అలరిస్తున్నాయి. అలా సరదాగా తేజా ఏదో పెట్టడం దానికి ప్రశాంత్ వర్మ కామెంట్ పెట్టడం దానికి తేజా రిప్లై ఇస్తే దానికి ప్రశాంత్ వర్మ కామెంట్ తిరిగి కామెంట్ పెట్టడం ఇలా జరుగుతుంది. లేటెస్ట్ గా అలాంటి ఫన్నీ ట్వీట్ చాట్ జరిగింది. తేజా సజ్జా రణ్ వీర్ సింగ్ తో




కలిసి దిగిన ఫోటోను షేర్ చేస్తూ ఆయన తేజా గురించి చెప్పిన విషయాలను ప్రస్తావించాడు. రణ్ వీర్ లాంటి స్టార్ తనని పొగడటంతో తేజా ఆ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా పంచుకున్నాడు. ఐతే ఆ ట్వీట్ కు ప్రశాంత్ వర్మ రెస్పాండ్ అవుతూ ఫోటో క్రెడిట్ లేదా పుష్పా అంటూ కామెంట్ పెట్టాడు. దానికి తేజా సజ్జ వచ్చేశాడు అంటూ కృష్ణ సినిమాలో బ్రహ్మానందం జిఫ్ పెట్టాడు. ఐతే దానికి కూడా ప్రశాంత్ వర్మ స్పందిస్తూ మనకు ఏం కావాలన్నా సరే అడిగి తీసుకోవా లని ఒక పెద్దాయన చెప్పాడంటూ కామెంట్ పెట్టాడు. ఈ సరదా సంభాషణలు నెటిజన్లను అలరించింది. ఈమధ్యనే పుష్ప 2 చెన్నై ఈవెంట్ లో దేవి శ్రీ ప్రసాద్ మనకు ఏం కావాలనా సరే అడిగి తీసు కోవాలని చెప్పాడు. ఆయన చెప్పిన సందర్భం ఏమో కానీ తేజా గురించి ప్రశాంత్ వర్మ పెట్టింది మాత్రం ఫన్నీగా ఉంది. ఇక ప్రశాంత్ వర్మ ప్రస్తుతం మూడు సినిమాలతో బిజీ బిజీగా ఉన్నాడు.

జై హనుమాన్ చేస్తూనే మహాకాళి, అధీరా చేస్తున్నాడు. అంతేకాదు నందమూరి వారసు డు మోక్షజ్ఞ తెరంగేట్రం సినిమాను కూడా ప్రశాంత్ వర్మ డైరెక్ట్ చేస్తున్నా డు. హనుమాన్ తో పాన్ ఇండియా లెవెల్ లో తన సత్తా చాటిన ప్రశాంత్ వర్మ రాబోయే సినిమాలతో మరింత క్రేజ్ తెచ్చుకునేలా ఉన్నాడు. తేజ్జా సినిమాల విషయానికి వస్తే జై హనుమాన్ లో చిన్న పార్ట్ అయ్యే ఛాన్స్ ఉండగా కార్తీక్ ఘట్టమనేని డైరెక్షన్ లో మిరాయ్ సినిమాతో భారీ స్కెచ్ వేశాడు. ఈ సినిమా గ్లింప్స్ తోనే సినిమాపై సూపర్ బజ్ ఏర్పడింది.





# ఈ కాసులు పిండుకోవటం ఏంటి పుష్పా?



అభిమాన హీరో సినిమా వస్తుదంటే.. వ్యక్తిగత పనుల్ని సైతం పక్కన పడేసి.. ముందు వెండితెర మీద అభిమాన నటుడి సినిమా చూడటానికి మించిన పనేం ఉండదన్నట్లుగా వ్యవహరించటం తెలుగు వారికి ఉన్న బలహీనత. ఈ తీరుకు సగటు కార్మికుడు మొదలుకొని కంపెనీ సీఈవో వరకు మినహాయింపులు ఉండవు. మిగిలిన విషయాల్లో ఎంతో క్రమశిక్షణతో వ్యవహరించే వారు సైతం అభిమాన హీరో సినిమా విషయంలోనూ.. క్రేజీ మూవీ విషయంలో అస్సలు తగ్గేదేలే అన్నట్లు వ్యవహరించటం కామన్ గా కనిపిస్తూ ఉంటుంది. ఈ తీరును నిర్మాతలు క్యాష్ చేసుకోవాలనుకోవటంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఏళ్లుగా ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్న పుష్ప2 ది రూల్ చిత్రం టికెట్ ధరల పెంపు అంశం అభిమానులకు షాక్ కు గురి చేస్తోంది. తాజాగా తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఈ నెల ఐదున సినిమా విడుదల కానుంది. అయితే.. ఈ చిత్రానికి సంబంధించిన బెనిఫిట్ షో కు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. డిసెంబరు 4 రాత్రి తొమ్మిదిన్నర గంటల నుంచి బెన్ ఫిట్ షోను ప్రదర్శించేందుకు వీలుగా అనుమతులు ఇచ్చారు. ఇదంతా బాగానే ఉన్నా.. ఈ బెన్ ఫిట్ షో ను ప్రదర్శించే అన్ని రకాల స్క్రీన్లలో టికెట్ ధరను రూ.800 పెంచుకోవటానికి ఓకే చెప్పటం అభిమానులకు షాకింగ్ గా మారింది. సాధారణంగా పెద్ద సినిమాలు.. క్రేజీ సినిమాల్ని విడుదల చేసే వేళలో.. పరిమిత థియేటర్లలో మహా అయితే.. వేళ్ల మీద లెక్కించేలా కొన్ని థియేటర్లకు పర్మిషన్ ఇస్తారు. అందులోనూ ఆ షోను సెకండ్ షో అయిపోయిన తర్వాత అంటే అర్ధరాత్రి వేళలో ఈ షోను వేస్తారు. దీన్ని ఫ్యాన్స్ షోగా పేర్కొంటారు. ఈ షోకు అమ్మే టికెట్ ధర ఎక్కువగా ఉన్నప్పటికి.. ఆ షో తర్వాత నుంచి మాత్రం టికెట్ ధరలు మామూలుకంటే కాస్త ఎక్కువగా ఉండటం కామన్. పుష్ప 2 విషయానికి వస్తే.. రాత్రి తొమ్మిదిన్నర గంటలనుంచి వేసే షోలకు టికెట్ ధరల్ని భారీగా పెంచేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించటంతో.. పెద్ద ఎత్తున స్క్రీన్లలో ఈ షోను వేసే వీలుందని చెబుతున్నారు. ఐదో తేదీ ఉదయం ఆరున్నర గంటలకు పడే షోకు ముందు.. దాదాపు రెండు షోలు పడతాయని చెబుతున్నారు. నాలుగో తేదీ రాత్రి తొమ్మిదిన్నరకు మొదటి షో.. తర్వాత ఒంటి గంట తర్వాత రెండో షో పడుతుందని.. ఐదో తారీఖు తెల్లవారుజామున వేసేది మూడో షో అంటున్నారు. తమ అభిమాన నటుడి సినిమాను మొదటి షో.. లేదంటే రెండో షోను మిస్ కాకుండా చూడాలనుకోవటం సగటు అభిమాని ఆశ.. ఆకాంక్ష. దీన్ని ఇలా కాసులు రాల్చుకునేలా మార్చుకోవటం బాగోలేదంటున్నారు. భారీ బడ్జెట్ సినిమాకు భారీగానే కలెక్షన్లు వస్తాయన్న అంచనాలు ఉన్న వేళ.. ఇంత భారీగా టికెట్ ధరల్ని పెంచటం ద్వారా సగటు అభిమానికి కష్టంగా మారుతుందంటున్నారు. సినిమా మీద ఉన్న అభిమానంతో తన వ్యక్తిగత.. కుటుంబ ఖర్చులకు కోత పెట్టి సినిమాకు ఖర్చు చేస్తారని చెబుతున్నారు. అభిమానులని దేవుళ్లుగా చెప్పే చిత్ర పరిశ్రమ.. సినిమా టికెట్ ధరల విషయానికి వస్తే.. సదరు దేవుళ్లకు అధిక ధరల వాయింపు ఎందుకు? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది.

# జపాన్ ఫ్యాన్స్ చెంతకు ప్రభాస్.. కారణమిదే!




జపాన్‌లో రజనీకాంత్ తర్వాత అంత పెద్ద స్టార్‌డమ్ అందుకున్నాడు ప్రభాస్. బాక్సాఫీస్ కలెక్షన్లలో అంతకుమించి అని నిరూపిస్తున్నాడు. పాన్-ఇండియన్ స్టార్ ప్రభాస్ కి జపనీ అభిమానులు బ్రహ్మరథం పడుతున్నారు. భారతదేశంలో అడుగుపెడితే ప్రభాస్ ఇల్లు వెతుక్కుంటూ వచ్చే జపనీ ఫ్యాన్స్ ఉన్నారని గతంలో ప్రూవ్ అయింది. బాహుబలి ఫ్రాంచైజీ, సలార్ భారీ విజయం ప్రభాస్‌ను జపాన్‌లో అత్యంత విజయవంతమైన భారతీయ సినీ నటుడిగా నిలబెట్టాయి. అతడు తన జపాన్ అభిమానులను మరోసారి పలకరించడానికి సిద్ధంగా ఉ న్నాడు. ప్రభాస్ నటించిన లేటెస్ట్ బ్లాక్ బస్టర్, సైన్స్ ఫిక్షన్ డ్రామా 'కల్కి 2898 %ూణ%' జపాన్‌లో 3 జనవరి 2025న జపాన్‌లో నూతన సంవత్సర పండుగ అయిన షోగట్సు డే కి విడుదలవుతుందని తెలుస్తోంది. కల్కి జపనీ వెర్షన్‌ను ప్రముఖ జపనీస్ డిస్ట్రిబ్యూషన్ హౌస్ అయిన ట్విన్ రెడీ చేస్తోంది. ఈ సంస్థ అక్కడ భారీగా పంపిణీ చేస్తుంది. తాజా సమాచారం ప్రకారం... ప్రభాస్ .. కల్కి బృందం త్వరలో కల్కి సినిమాని థియేటర్లలో విడుదల చేయడానికి ముందు ప్రమోషన్స్ కోసం జపాన్‌కు వెళ్లనున్నారు. ప్రభాస్ సహా దర్శకుడు నాగ్ అశ్విన్ కూడా ఈ టూర్ కి వెళ్లే ఛాన్సుంది. ఈ హై-బడ్జెట్ ఎంటర్‌టైనర్‌లో బాలీవుడ్ స్టార్స్ అమితాబ్ బచ్చన్, దీపికా పదుకొణె ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రంలో విశ్వ నటుడు కమల్ హాసన్ విలన్ పాత్రను పోషించారు. కల్కి 2898 AD గతంలో విడుదలై ప్రపంచ బాక్సాఫీస్ వద్ద రూ. 1,100 కోట్లకు పైగా వసూలు చేసింది. ఇప్పుడు జపాన్ వసూళ్లు 30 కోట్లు దాటుతాయని అంచనా వేస్తున్నారు.

# స్నేహితుడిని పెళ్లాడే ముందు చీరలో సింగారం

జాతీయ అవార్డు గ్రహీత, యువనటి కీర్తి సురేష్ పెళ్లి గురించి గత కొన్ని నెలలుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎట్టకేలకు గుసగుసలే నిజమయ్యాయి. తన స్నేహితుడు అయిన దుబాయ్ బిజినెస్ మేన్ ఆంటోనిని కీర్తి పెళ్లాడేయబోతోంది. ఈ విషయాన్ని తనే స్వయంగా సోషల్ మీడియాల్లో ధృవీకరించింది. మీడియా ఊహాగానాలకు చెక్ పెడుతూ ఈ అధికారిక ప్రకటన అనంతరం కీర్తి శుక్రవారం తన తల్లిదండ్రులతో కలిసి శ్రీ వెంకటేశ్వర స్వామిని సందర్శించడానికి తిరుపతికి వెళ్లింది. కీర్తితో పాటు తన తల్లి మేనక, తండ్రి జి. సురేష్‌కుమార్ కూడా తిరుమలేశుని చెంత మొక్కు తీర్చుకోవడానికి విచ్చేశారు. ఈ డిసెంబర్ లోనే కీర్తి- ఆంటోని పెళ్లి జరగనుంది. అంతకంటే ముందే తన బాలీవుడ్ అరంగేట్రం కోసం ఆశీర్వాదం కోసం అక్కడకు వచ్చినట్లు కీర్తి తిరుమలలో విలేకరులకు తెలియజేసింది. కీర్తి సురేష్ తన చిన్ననాటి స్నేహితుడు ఆంటోనిని



పెళ్లి చేసుకోవడం అధికారికం. ఆ ఇద్దరూ కాలేజీ రోజుల నుంచి ప్రేమించుకుంటున్నారని కథనాలొచ్చాయి. సినిమాల్లోకి వచ్చి స్టార్ హీరోయిన్ అయిన తర్వాత కూడా కీర్తి తన ప్రేమను కొనసాగించింది. 15 ఏళ్లుగా పరిచయం ఉన్న వీరిద్దరూ ఇప్పుడు పెళ్లి పీటలు ఎక్కబోతున్నారు. %వచ్చే నెలలో నాకు పెళ్లి, నా హిందీ సినిమా కూడా త్వరలో విడుదల కానుంది.. అందుకే దేవుడి ఆశీస్సులు పొందేందుకు వచ్చాను. డిసెంబర్‌లో గోవాలో పెళ్లి జరగనుందని కీర్తి ధృవీకరించింది. డిసెంబర్ 11-12 తేదీల్లో గోవాలో కీర్తి పెళ్లి జరగనుంది. ఈ పెళ్లికి ముందు కీర్తి ఫోటోషూట్లు ఆసక్తికరంగా మారాయి. ఇటీవల కీర్తి కొన్ని బోల్డ్ ఫోటోషూట్లను సోషల్ మీడియాల్లో షేర్ చేసింది. దానికి భిన్నంగా కీర్తి ట్రెడిషనల్ శారీ లుక్ లను కూడా ఇప్పుడు షేర్ చేస్తోంది. తాజాగా కీర్తి నీలి రంగు డిజైనర్ శారీలో ప్రత్యక్షమైంది. ఈ ఫోటోగ్రాఫ్ లో దేవతాసుందరిని తలపిస్తోంది. పెళ్లికి ముందు కీర్తి మూడ్ ని ఇది ఎలివేట్ చేస్తోందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. కెరీర్ మ్యాటర్ కి వస్తే... కీర్తి సురేష్ త్వరలో బేబీ జాన్‌లో కనిపించనుంది. ఈ చిత్రానికి కలీస్ దర్శకత్వం వహించారు. వరుణ్ ధావన్, కీర్తి సురేష్, వామిక గబ్బి ఇందులో ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రం డిసెంబర్ 25న థియేటర్లలో విడుదల కానుంది. మహానటి, దసరా, భోళా శంకర్ సహా పలు విజయవంతమైన చిత్రాల్లో కీర్తి నటించిన సంగతి తెలిసిందే.

# ఆ సూపర్ హిట్ ఐటెంపై తమన్నా అసంతృప్తి

మిల్కీ బ్యూటీ తమన్నా గత ఏడాదిలో జైలర్ సినిమాలో ఐటెం సాంగ్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. వా కావాలయ్యా అంటూ సాగిన ఆ పాట ఏడాది అంతా సోషల్ మీడియాలో ఏ స్థాయిలో చక్కర్లు కొట్టిందో తెలిసిందే. ఆ పాటలో తమన్నా డాన్స్‌కి ప్రతి ఒక్కరు ఫిదా అయ్యారు. రజనీకాంత్ కంటే ఎక్కువగా ఆ పాటలో తమన్నాను ప్రేక్షకులు చూశారు. మిల్కీ బ్యూటీ తమన్నా స్థాయి ఇది అంటూ ఆ డాన్స్ వీడియోలను షేర్ చేస్తూ ఆమె ఫ్యాన్స్‌తో పాటు ఎంతో మంది సోషల్ మీడియా ద్వారా కామెంట్స్ చేయడం తెలిసిందే. ఇప్పుడు మరోసారి ఆ పాట గురించిన ప్రస్థావన సోషల్ మీడియాలో వచ్చింది. జైలర్ సినిమా కోసం వా కావాలయ్యా పాట చేసిన తర్వాత బాలీవుడ్ బ్లాక్ బస్టర్ మూవీ స్త్రీ 2 లో ఆజ్ కీ రాత్ పాటలోనూ తమన్నా సందడి చేసింది. ఆ సినిమా భారీ విజయం సాధించడంలో తమన్నా కీలక పాత్ర పోషించింది. జైలర్, స్త్రీ 2 లో తమన్నా డాన్స్ సూపర్ అంటూ ఫ్యాన్స్‌తో పాటు ప్రతి ఒక్కరు అభిప్రాయం వ్యక్తం చేస్తూ ఉన్నారు. అయితే తమన్నా మాత్రం ఇటీవల ఒక చిట్ చాట్‌లో వా కావాలయ్యా పాటలో తన డాన్స్ విషయంలో అసంతృప్తి వ్యక్తం చేసింది. తాను ఆ పాట కోసం మరింతగా డాన్స్ చేసే అవకాశం ఉ ంది, కానీ కొన్ని కారణాల వల్ల తన పూర్తి సామర్థ్యంను చూపించలేక



పోయాను అంది. జైలర్ సినిమాలో కెరీర్ బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇచ్చింది తమన్నా అంటూ ఒక వైపు ప్రచారం జరుగుతూ ఉంటే మరో వైపు ఆమె మాత్రం ఇలా తన ప్రదర్శన పట్ల తానే అసంతృప్తి వ్యక్తం చేయడం విడ్డూరంగా ఉంది అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇంతకు తమన్నా ఆ సమయంలో తన స్థాయికి తగ్గట్లుగా ఎందుకు చేయలేదు అంటూ కొందరు ప్రశ్నిస్తున్నారు. సోషల్ మీడియాలో తమన్నా అందాల ఆరబోత ఫోటోలు, వీడియోలు రెగ్యులర్‌గా వైరల్ అవుతూ ఉంటాయి. ఇప్పుడు తమన్నా కావాలయ్యా పాట గురించి చేసిన ప్రకటన పై అంతా చర్చించుకుంటూ ఉన్నారు. మిల్కీ బ్యూటీ తమన్నా తెలుగు లో ఎంట్రీ ఇచ్చి దాదాపుగా రెండు దశాబ్దాలు అయింది. హ్యాపీ డేస్ తర్వాత ఒక్కసారిగా ఈ అమ్మడి క్రేజ్ మారిపోయింది. అందుకు తగ్గట్లుగానే ఈ అమ్మడి సినిమాలు చేస్తూ వచ్చింది. టాలీవుడ్ లో సీనియర్ స్టార్ హీరోల నుంచి యంగ్ స్టార్ హీరోల వరకు ఎందరితోనో సినిమాలు చేసిన ఈ అమ్మడు బాలీవుడ్, తమిళ్ సినిమాల్లోనూ నటించింది. కన్నడంతో పాటు మలయాళ సినిమాల ఇండస్ట్రీలో ఈమెకు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. హీరోయిన్‌గానే కాకుండా ఐటెం సాంగ్స్‌లో, మ్యూజిక్ వీడియోస్‌లోనూ తమన్నా నటించి మెప్పించింది.

గరుడ వార్త





# ఆరోగ్య ఉత్సవాలకు సీఎం రేవంత్ శ్రీకారం.. 213 అంబులెన్సులు ప్రారంభం

హైదరాబాద్: ప్రజా పాలన - ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఆరోగ్య ఉత్సవాలకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఎన్టీఆర్ మార్గ్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో 108, 102 వాహనాలకు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. 108 సర్వీసుల కోసం 136 అంబులెన్సులు, 102 సర్వీసుల కోసం 77 అంబులెన్సులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను ఇతర మంత్రులు, నేతలతో కలిసి సీఎం పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో 28 పారామెడికల్, 16 నర్సింగ్ కాలేజీలను సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు.

33 ట్రాన్స్‌జెండర్ల క్లీనిక్‌లను ప్రారంభించడంతో పాటు 442 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, 24మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లకు నియామక పత్రాలు అందజేశారు. మైత్రి ట్రాన్స్ క్లీనిక్‌లు ప్రతి గురువారం సేవలందించనున్నాయి. కొత్తగా ప్రారంభించిన వాటితో కలిపి రాష్ట్రంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల సంఖ్య 37కి పెరిగింది.

# సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు సైతం ఆయిల్ పామ్ సాగు బాట పట్టారు..



ఖమ్మం: ఆయిల్ పామ్ సాగుతో రైతన్నను రాజుగా మార్చడమే తన కలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతులు నష్టాల బారిన పడకుండా లాభాలు తెచ్చిపెట్టే పంట ఆయిల్ పామ్ అని తుమ్మల చెప్పారు. తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయ్యే నాటికి పామాయిల్ గెల ధర భారీగా పెరిగిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం టన్ను పామాయిల్ గెలల ధర రూ.20,413 ఉన్నట్లు ఆయన వెల్లడించారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు పొలం బాట పట్టేలా ఆయిల్ పామ్ సాగు ఉందని, తెలంగాణను ఆయిల్ పామ్ సాగుకు హబ్‌గా మార్చడమే తన జీవిత లక్ష్యమని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. "నా చిరకాల కోరిక సీతారామ ప్రాజెక్టుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయడం. ఆగస్టు 15, 2025 కల్లా సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందిస్తాం. రూ.66 కోట్లతో మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంక్రాంతి నాటికి శంకుస్థాపన చేస్తాం. జాతీయ రహదారుల ఏర్పాటుతో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రగతి బాట పడుతోంది. నా రాజకీయ జీవితంలో ఇరిగేషన్ నేషనల్ హైవేల కోసం క్యాబినెట్‌లో పనిచేసే అవకాశం లభించింది. రైతు బిడ్డనైన నాకు వ్యవసాయ శాఖ మంత్రిగా సీఎం రేవంత్ రెడ్డి పనిచేసే అవకాశం కల్పించారు. ఉద్యాన పంటలు సాగుతో రైతాంగానికి మేలు జరుగుతుంది. ఎకరాకు నాలుగు ఏళ్లలో రూ.50 వేలు ప్రోత్సాహకం అందిస్తాం. భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణం చేయనున్నాం. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈనెల 7న దానికి శంకుస్థాపన చేయనున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వసతులు కల్పించడం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీట్ల పెంపుపై ఆరోగ్య శాఖ మంత్రికి ప్రతిపాదనలు పంపా. విద్యా రంగంలో అంతర్జాతీయస్థాయి ప్రఖ్యాతి గాంచిన స్వామి నారాయణ ట్రస్ట్ గురుకుల పాఠశాల ఏర్పాటు చేస్తున్నాం. ఖమ్మం ఎమ్మెల్యేగా క్యాబినెట్‌లో ఉండే అవకాశం రావడం నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదం. రఘునాథపాలెం మండలం సాగునీటి కష్టాలు తీరేలా సాగర్ కాలువపై లిఫ్ట్ ఏర్పాటు చేస్తాం. దిగుమతి సుంకాలు పెంచడం వల్ల దేశీయంగా ఆయిల్ పామ్ రైతాంగానికి లాభాలు వస్తాయి. ఏడాదికి లక్ష ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. అరాచకం, అక్రమాలు లేని ప్రశాంతమైన ఖమ్మం కోసం ప్రజలు గత ఎన్నికల్లో తీర్పు ఇచ్చారు. ప్రజాపాలనలో ప్రజలు కోరినట్లుగానే ఖమ్మం ప్రగతి బాట పడుతోంది" అని అన్నారు.

# రైతుబంధు ఆపింది సీఎం రేవంత్‌రెడ్డే: హరీశ్‌రావు



హైదరాబాద్: గతంలో మూడు పంటలకు రైతుబంధు ఇవ్వాలని రేవంత్‌రెడ్డి అన్నారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు చెప్పారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక.. ఉన్న రైతుబంధునే ఇవ్వట్లేదు. రైతు, కౌలు రైతు మాట్లాడుకోవాలని సీఎం, మంత్రి అంటున్నారు. రైతుబంధును ఆపింది సీఎం రేవంత్‌రెడ్డే. రైతుబంధు, బీమా ద్వారా రైతులకు రూ.82 వేల కోట్లు ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వం. బతుకమ్మ చీరలనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొట్టింది. గతంలో ఎల్‌ఆర్‌ఎస్ విషయంలో భారాస సర్కార్‌పై అసత్య ఆరోపణలు చేశారు. రూ.15 వేల కోట్లు ప్రజల నుంచి కట్టించాలని అధికారులకు ఆదేశాలు ఇస్తున్నారు. పేదలపై ప్రేమ ఉంటే ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా చేయాలి. పరీక్షలు వాయిదా వేయాలని నిరుద్యోగులు అడుగుతుంటే ప్రతిపక్షాల కుట్ర అంటున్నారు. గతంలో భారాస పాలనలో సర్వే చేస్తే ఆరోపణలు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సర్వే ఎలా ఉందో రేవంత్‌రెడ్డి చెప్పాలి. గతంలో మాట్లాడిన మాటలపై ఆయన ఆత్మవిమర్శ చేసుకోవాలి" అని హరీశ్‌రావు హితవు పలికారు.

# కేసీఆర్ మొక్క కాదు.. కేసీఆర్ ఒక వేగు చుక్క : ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్ : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మొక్క అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. కేసీఆర్ మొక్క కాదు పీకేయడానికి... కేసీఆర్ ఒక వేగుచుక్క అని కొనియాడారు. రేవంత్ రెడ్డి గురువులకే చుక్కలు చూపించి తెలంగాణ సాధించిన శక్తి కేసీఆర్ అని కవిత ప్రశంసించారు.

ఎమ్మెల్సీ కవిత నివాసంలో కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై కేసులు పెట్టి వేధిస్తే ఊరుకోబోము. ముఖ్యమంత్రి, మంత్రులు అదే పనిగా తిట్ల పరిపాలన చేస్తున్నారు. కేసీఆర్ పాలనలో నిధులు వరదలయ్యి పారేవి%ా% ఇప్పుడు రాష్ట్రంలో తిట్లు పారుతున్నాయని కవిత విమర్శించారు.

# భారాస సినిమాకు శుభం కార్డు పడిపోయింది: ఆది శ్రీనివాస్

హైదరాబాద్: బతుకమ్మ చీరల పేరిట గత ప్రభుత్వం నేతన్నల జీవితాలను ఆగం చేసిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. సూరత్ నుంచి తెచ్చి బతుకమ్మ చీరలు ఇచ్చారని ఆరోపించారు. అవి పంట చేలలో బెదురు పెట్టేందుకు ఉపయోగపడ్డాయి తప్ప.. ధరించేందుకు పనికిరాలేదని మండిపడ్డారు. క్యాబినెట్‌లో మహిళకు స్థానం కల్పించని చరిత్ర భారాస సర్కారుదని విమర్శించారు. హైదరాబాద్ సీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "బతుకమ్మ చీరలను అసలు మహిళలు కట్టుకున్నారా? ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వని పాలన భారాస సర్కారుది. గ్రూప్ వన్ పేపర్లను లీక్ చేసిన చరిత్ర గత ప్రభుత్వానిది.

భారాస సినిమాకు శుభం కార్డు పడిపోయింది. సమగ్ర సర్వే చేయించి ఆ నివేదికలను అటకెక్కించారు. బీసీలకు భారాస అనుకూలమా? కాదా? తేల్చి చెప్పాలి. జనాభా దామాషా పద్ధతిలో అన్ని వర్గాలకు ఫలితాలు దక్కాల్సిందే. హైదరాబాద్‌ను కాపాడాలనే ఉద్దేశంతోనే హైడ్రాను తీసుకొచ్చాం. దానికి కూడా తూట్లు పొడిచేందుకు ప్రయత్నిస్తున్నారు" అని ఆది శ్రీనివాస్ విమర్శించారు.

# మహిళలేమైనా కుందేళ్లా?: రేణుకా చౌదరి

దేశంలో జనాభా వృద్ధి రేటు తగ్గుదలపై ఆందోళన వ్యక్తం చేసిన ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్.. ప్రతి జంట ముగ్గురు పిల్లలకు జన్మనివ్వాలని పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి స్పందిస్తూ.. వరుసగా పిల్లలను కనడానికి మహిళలేమైనా కుందేళ్లా? అని ప్రశ్నించారు. నిరుద్యోగ సమస్యను ఎత్తిచూపుతూ.. ఖాళీగా ఉన్నవారికి తమ బిడ్డలను ఇచ్చి పెళ్లి చేసేందుకు ఎవరూ సిద్ధంగా లేరని ఓ జాతీయ వార్తాఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. "ఉద్యోగం లేని యువకులకు తమ అమ్మాయిని ఇచ్చి పెళ్లి చేసేందుకు ఎవరూ ఇష్టపడరు. దీంతో దేశంలో నిరుద్యోగ యువకులు వివాహాలు చేసుకోలేకపోతున్నారు. ఉద్యోగాలు లేనప్పుడు భాగస్వామిని ఎలా సంరక్షించగలుగుతారు? వృద్ధ తల్లిదండ్రులే పిల్లల్ని చూసుకోవడంతోపాటు పనులు కూడా చేస్తున్నారు. ఎక్కువ మంది పిల్లల్ని కనాలని వారు (మోహన్ భాగవత్) చెబుతున్నారు. వరుసగా పిల్లలను కనడానికి మహిళలేమైనా కుందేళ్లా? అలా చెప్పేవాళ్లు ఎంతమంది పిల్లల్ని పెంచగలరు? వారి అనుభవమేంటో తెలుసు" అని రేణుకా చౌదరి ఘాటుగా వ్యాఖ్యానించారు.

ఆహార ధరలు, ఆహార కల్తీ, ప్రయాణ ఖర్చులు పెరగడాన్ని ప్రస్తావించిన ఆమె.. ఎవరైనా అనారోగ్యంతో ఆసుపత్రి పాలైతే చికిత్సకయ్యే ఖర్చు భారీగా ఉంటోందన్న విషయాన్ని ప్రస్తావించారు. ఇదిలాఉంటే, జనాభాలో క్షీణత కొనసాగితే సమాజం దానంతట అదే నశించిపోతుందని ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ హెచ్చరించారు. నాగ్‌పూర్‌లో ఇటీవల నిర్వహించిన ఓ కార్యక్రమంలో ప్రసంగిస్తూ.. కుటుంబ ప్రాధాన్యాన్ని చాటిచెప్పారు. ఈ క్రమంలో ప్రతి జంట ముగ్గురు పిల్లలకు జన్మనివ్వాలని పిలుపునిచ్చారు.




# ఘనంగా తెలుగు యూనివర్సిటీ వార్షికోత్సవం

హైదరాబాద్: బాచుపల్లిలోని తెలుగు యూనివర్సిటీ 39వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మంత్రి శ్రీధర్ బాబు, శాంతా బయోటెక్ వ్యవస్థాపకుడు వరప్రసాద్ రెడ్డి, ప్రముఖులు హాజరయ్యారు. వరప్రసాద్ రెడ్డికి మంత్రి పురస్కారం అందించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



# కోకాకోలా కంపెనీని ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

బండతిమ్మాపూర్: సిద్దిపేట జిల్లా బండ తిమ్మాపూర్‌లో రూ.1000 కోట్లతో నిర్మించిన కోకాకోలా కంపెనీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు.

అనంతరం ప్లాంట్‌లో కలియతిరిగారు. కూల్ డ్రింక్ తయారీ వివరాలను అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గజ్వేల్ నియోజకవర్గంలో పర్యటించడం ఇదే తొలిసారి. సీఎం వెంట మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, కొండా సురేఖ ఉన్నారు. సీఎం పర్యటన సందర్భంగా కంపెనీలోకి కాంగ్రెస్ నేత నర్సారెడ్డిని పోలీసులు అనుమతించకపోవడంతో కార్యకర్తలు ఆందోళనకు దిగడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. కంపెనీ గేటు ధ్వంసం చేసి కార్యకర్తలు లోపలికి దూసుచ్చినట్లు సమాచారం.

# రేవంత్ రెడ్డి నన్ను కాల్చి చంపినా.. నేను నోరు లేని పేదబిడ్డల పక్షపాతిగానే ఉంటా : ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డి.. మీరు నా మీద ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, కాల్చి చంపినా నేను నోరు లేని ఈ పేద బిడ్డల పక్షపాతిగానే ఉంటానని బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ గురుకుల బాట చేపట్టిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై రేవంత్ సర్కార్ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డిపై ఆర్ఎస్పీ తీవ్రంగా స్పందించారు. మీ సోషల్ మీడియా లీకులు, మీరిచ్చిన స్క్రిప్ట్ ప్రకారం మతిస్థిమితం లేని మంత్రులు, ఎమ్మెల్యేలు, మరెందరో చిల్లర మూకలు నాపై చేస్తున్న దాడికి నేను బెదరను. మీరేసే తాయిలాలకు గతంలో లొంగలేదు, భవిష్యత్తులో కూడా లొంగను. మీరు స్కూళ్లకు తాళాలు వేసుకుంటెనో, పోలీసులతో మమ్ముల అరెస్టు చేయిస్తేనో మా గురుకుల బాట ఆగుతదనుకుంటే మీ అంత మూరు?లు ఇంకొకరుండరు అని రేవంత్ రెడ్డిపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు.

**నలుగురి కోసం నలభై మంది పనిచేయొచ్చు కానీ..** ఇక అసలు విషయానికొస్తే.. మీరు ఎందుకు నిజాలను దాచిపెట్టాలని అనుకుంటున్నారో ప్రజలకు చెప్పండి. మీరు చెప్పకపోతే వాటిని చెప్పాల్సిన బాధ్యత మా పిల్లలకోసం మా బీఆర్ఎస్ పార్టీపై ఉంది. మీ బంగళాలో బతికే నలుగురి కోసం నలభై మంది పనిచేయొచ్చు కానీ, మా పేద పిల్లలు చదువుకునే హయత్ నగర్ ప్రతిభా పాఠశాలలో 600 మంది విద్యార్థుల స్కూల్‌ను శుభ్రం చేయడానికి కేవలం ఒకటే ఒక వృద్ధ మహిళను ఎట్ల పెడుతరు..? అదీ ఆమెకు టైంకు జీతాలు ఇవ్వకుండా..? అని ఆర్ఎస్పీ నిలదీశారు.

**మీ పిల్లలకు టీచర్లు లేకపోతే మీరు ఊరుకుంటారా?...** రాష్ట్రంలో అత్యంత ప్రతిభావంతులైన పేద పిల్లలను ఎంట్రన్స్ ద్వారా సెలక్టు చేసి వాళ్లకు అవసరమైన ఉపాధ్యాయులను ఇవ్వకపోతే వాళ్ల భవిష్యత్‌కు భరోసా ఎవ్వరు..? హయత్ నగర్‌లో ఇంటర్మీడియట్‌కు ఇప్పటికీ ఇద్దరు జూనియర్ లెక్చరర్స్ లేరని పిల్లలు కన్నీరు పెట్టుకున్నారు. వాళ్లు పరీక్షలు ఎట్ల పాసైతరు? మీ పిల్లలకు టీచర్లు లేకపోతే మీరు ఊరుకుంటారా? ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పిల్లలు ఇంగ్లీష్ మాట్లాడలేని పరిస్థితి దాపురించిన పరిస్థితిని మీరెట్ల చూస్తరు? అని రేవంత్ రెడ్డిని ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.

**మీ సైకో-రౌడీ కుట్రలు బంజేయండి..** బ్లాక్ అయి అత్యంత దుర్గంధం వెదజల్లుతున్న టాయిలెట్లు ఉంటే విద్యార్థులు కాలకృత్యాలు ఎట్ల తీర్చుకుంటరు? విధిలేక రోజూ బహిరంగ మల విసర్జనకు చీకట్లో ఈ పేద బిడ్డలు భయంభయంగా పోతున్నారు! అడవుల్లో వాళ్లకు ఏమైనా పాములు తేళ్లు కరిస్తే వాళ్ల ప్రాణాలకు మీరు గ్యారంటీ ఇవ్వగలరా? కుళ్లి పోయిన కూరగాయలతో పిల్లలకు వంటలెట్ల చేస్తరు? మీ ఇంట్లో అట్లనే తింటారా? యూనిఫాంలు, దుప్పట్లు, బెడ్లు, బూట్లు లేకుండా, రోజూ అడవుల్లో ఈగలు దోమల మధ్య చదవడానికి ఈ పిల్లలు ఏమైనా పశువులా? మీకు దమ్ముంటే బంగళా నుండి బయటికొచ్చి గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ విద్యాలయాల్లోకి వెళ్లండి. మీ సైకో-రౌడీ కుట్రలు బంజేయండి.

పరిపాలన మీద దృష్టి సారించండి అని రేవంత్ రెడ్డికి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఘాటుగా చెప్పారు.

# ఎస్ఐ సూసైడ్ వ్యవహారంలో సంచలన విషయాలు

జయశంకర్ భూపాలపల్లి: ములుగు జిల్లా, వాజేడు ఎస్ఐ రుద్రారపు హరీష్ ఆత్మహత్య వ్యవహారంలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆదివారం రాత్రి తన గర్ల్ ఫ్రెండ్ తో పూసూరు గోదావరి బ్రిడ్జి సమీపంలోని ఫెరిడో రిసార్ట్స్‌కు వెళ్ళారు. ఇంట్లో వేరే పెళ్లి సంబంధం చూస్తుండడంతో ఎస్ఐ మనస్థాపానికి గురయ్యారు. పెళ్లి వ్యవహారంతోనే మనస్థాపానికి గురై గన్‌తో కాల్చుకొని చనిపోయారు. దీంతో ఎస్ఐ హరీష్ స్వంత గ్రామం గొరికొత్తపల్లి మండలం, వెంకటేశ్వర్లుపల్లిలో విషాదం నెలకొంది. ఎస్ఐకు 10 రోజుల క్రితమే పెళ్లి నిశ్చయమైంది. సొంత గ్రామంలో కొత్త ఇళ్ళు నిర్మాణం కూడా చేపట్టారు. కాగా ములుగు జిల్లా, వాజేడు మండలం ఎస్ఐ రుద్రారపు హరీష్ ఆత్మహత్య చేసుకున్నారు. పూసూరు గోదావరి బ్రిడ్జి సమీపంలోని ఫెరిడో రిసార్ట్స్‌లో తుపాకితో కాల్చుచుకుని చనిపోయారు. ఆదివారం వెళ్లిన ఎస్ఐ రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో వేసి చూసిన స్టేషన్ సిబ్బంది సోమవారం ఉదయం రిసార్ట్స్‌కు వెళ్లి చూడగా హరీష్ విగతజీవిగా కనిపించారు.

ఎస్ఐ నిన్న (ఆదివారం) రిసార్ట్స్‌లో గది అద్దెకు తీసుకుని ఉన్నారు. ఎవరు ఫోన్ చేసిన ఆయన అందుబాటులోకి రాలేదు. ఆయన ఆత్మహత్యకు ఇంట్లో కుటుంబ కలహాలు, వ్యక్తిగత కారణంగా సమాచారం. రిసార్ట్స్ సిబ్బంది ఎన్ని సార్లు డోర్ కొట్టినా తలుపు తెరవలేదు. దీంతో సోమవారం ఉదయం వాజేడు పోలీసులకు సిబ్బంది సమాచారం అందించారు. పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకున్న తర్వాత రిసార్ట్స్ సిబ్బంది డోర్ పగులగొట్టి చూడగా ఎస్ఐ విగతజీవిగా పడి ఉన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com